ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 7 నవంబరు 2024





సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

జగన్ ప్రభుత్వం రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసేలా తీసుకున్న నిర్ణయాలను కూటమి ప్రభుత్వం సవరిస్తూ వస్తోంది. సీఆర్‌డీఏ పరిధిని గత ప్రభుత్వం కుదించగా తాజాగా దానిని పూర్వస్థితికి తెచ్చారు. ఏపీసీఆర్‌డీఏ(ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజన్ డెవల ప్‌మెంట్ అథారిటీ) పరిధిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిం ది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి దీనికి ఆమోదముద్ర వేసింది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు మండలాలు, 92 గ్రామాలు, బాపట్ల జిల్లాలోని ఐదు మండలాల్లోని 62 గ్రామాలు తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి వచ్చాయి. దీంతో సీఆర్‌డీఏ విస్తీర్ణం తిరిగి 8352.69 చదరపు కిలోమీటర్లకు చేరింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లు పెట్టి రాజముద్ర వేయనుంది. ఈ నిర్ణయంపై సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాలు, పట్టణాల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

- పరిధిని పునరుద్ధరించిన ప్రభుత్వం
- 8,352.69 చదరపు కిలోమీటర్లకు చేరిన విస్తీర్ణం
- గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ మంత్రివర్గం తీర్మానం
- మంత్రివర్గం నిర్ణయంపై పల్నాడు, బాపట్ల జిల్లావాసుల హర్షం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు గత టీడీపీ ప్రభుత్వం కృషి చేయగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నింది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏను తొలుత రద్దు చేసేందుకు ప్రయత్నించి అది వీలు కాకపోవడంతో పరిధిని కుదించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా.. రాజధాని రైతులు పోరాడినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అమరావతిని పట్టాలెక్కిస్తోంది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏ పరిధిని పునరుద్ధరిస్తూ బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో సీఆర్‌డీఏ పరిధిపై అస్పష్టత నెలకొనగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకుంది. 2014లో ఏదైతే ఏపీసీఆర్‌డీఏ చట్టాన్ని ఆమోదించారో దానినే పునరుద్ధరించేందుకు ఆమోదముద్ర వేసింది. దీంతో గుంటూరు జిల్లాలో తాడేపల్లి మండలం, అర్బన్ ఏరియా, మంగళగిరి మండలం అర్బన్ ఏరియా, తుళ్లూరు, దుగ్గిరాల, తెనాలి మండలం, అర్బన్, గుంటూరు మండలం, అర్బన్, చేబ్రోలు, మేడికొండూరు, పెదకాకాని, వట్టిచెరుకూరు, అమరావతి, కొల్లిపర, వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాలు సీఆర్‌డీఏలోకి వచ్చాయి. వీటితో పాటుగా భట్టిప్రోలు మండలంలోని శివనాగులపాలెం, భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు, పొన్నూరు మండలంలో మునిపల్లె, మామిళ్లపల్లి, కొండముడి, ఉప్పరపాలెం, చింతలపూడి, వెల్లలూరు, ఆరేమండ, దండమూడి, పచ్చలతాడిపర్రు, మన్నవ, దొప్పలపూడి, జడవల్లి, నిడుబ్రోలు, జూపూడి, బ్రాహ్మణకోడూరు, వడ్డిముక్కల గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని కొండపాడు, యనమదల,

(మిగతా 6వ పేజీలో..)

దశ, దిశ లేని బావుడా

కేవలం ఓ నామినేటెడ్ పోస్టు సృష్టించడం కోసమే ఆదరాబాదరాగా గత వైసీపీ ప్రభుత్వం బావుడా ఏర్పాటు చేసిందనే విమర్శలున్నాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు, కాకుమాను మండలాలను కూడా బావుడా పరిధిలోకి తెచ్చింది. చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ఉడా పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మూడు అటు, మూడు ఇటు ఉన్నాయి. ఇక సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న వేమూరు నియోజకవర్గాన్ని తీసుకొచ్చి బావుడాలో అయితే విలీనం చేసింది తప్ప అభివృద్ధి విషయంలో ఓ దశ, దిశ చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తమ ప్రాంతం సీఆర్‌డీఏలోకి వెళ్లగా అభివృద్ధిపై గంపెడాశలతో ఉండగా వారి ఆశలను కాలరాస్తు వైసీపీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందనేది అక్కడి ప్రజల అభిప్రాయం.

తగ్గిన పూడా పరిధి

పల్నాడు జిల్లాలోని ఆరు మండలాలు, సత్తెనపల్లి మున్సిపాల్టీని సీఆర్‌డీఏలో విలీనం చేస్తూ క్యాబినెట్‌లో తీర్మానంతో పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అధార్టీ(పూడా) పరిధిని తగ్గింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలతో పూడాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 మండలాలకు పూడా పరిధిని కుదించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, యడ్లపాడు మండలాలను పూడా నుంచి తొలగించి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకున్నారు. దీంతో పూడా రూపురేఖలు మారిపోయాయి. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలు, గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకే పూడాకు పరిమితమైంది.



సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

అమరావతికి నిరంతరాయంగా వెలుగులు

- అండర్ గ్రౌండ్ కేబుల్.. నాణ్యమైన విద్యుత్ సరఫరా
- తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో నిర్మాణం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ.. ఐదు నెలల్లో పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం
- నేడు 400/220 కే.వీ.సబ్ స్టేషన్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తుళ్లూరు, గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిరంతరాయంగా.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా 400/220 కేవీ సబ్ స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో స్విచ్చింగ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని ఐదేళ్లుగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులను పట్టాలెక్కించే క్రమంలో ఈ సబ్‌స్టేషన్ పనులను తిరిగి చేట్టింది. ఐదు నెలల్లో పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ సబ్‌స్టేషన్‌తో రాజధాని అమరావతిలో నిర్మాణం జరిగే సచివాలయం హైకోర్టు, అసెంబ్లీ, రాజ్ భవన్, సీఎం క్యాంప్ కార్యాలయం, ప్రస్తుతం ఉన్న వెలగపూడి సచివాలయం, అసెంబ్లీ హైకోర్టు భవనాలకు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుంది. సబ్‌స్టేషన్ నుంచి రాజధాని ప్రాంతంలో ఎక్కడా స్తంభాలు లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. కొండపల్లి థర్మల్ పవర్ స్టేషన్ నుంచి తాళ్లాయపాలెం స్విచ్చింగ్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిరంతరం కరెంట్ సరఫరా అవుతుంది. దీంతో రాజధాని ప్రాంతంలో 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మరో ఆరు సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలతో పాటు 15 సబ్‌స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన, కొత్త విద్యుత్ లైన్లను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తాళ్లాయపాలెంలో అధికారులు భారీగా ఏర్పాట్లుచేశారు. ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి తదితరులు పరిశీలించారు. సబ్‌స్టేషన్ ప్రాంగణంలోనే ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు వేదికను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి రాజధాని ప్రాంతవాసులు భారీగా హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దారు సుజాత, నాయకులు పుట్టి రామచంద్రరావు, ధనేకుల సుబ్బారావు, లంకా సుధాకరరావు, కొండెపాటి బుజ్జి, శ్రీహరి, సుబ్రహ్మణ్యం, వాకచర్ల వీరాంజనేయులు, బెజవాడ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రారంభించే విద్యుత్ సబ్ స్టేషన్ పైలాన్

3.30 లక్షలు దాటిన దరఖాస్తులు

- పట్టభద్రుల ఓటుకు ముగిసిన గడువు
- 20 లోపు పరిశీలన పూర్తి.. 23న జాబితాల విడుదల

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు గ్రాడుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటుహక్కు కోసం పట్టభద్రులు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. చివరిరోజున 80వేలమందికి పైగా దరఖాస్తులు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఈఆర్‌వోకు చేరాయి. దరఖాస్తుకు గడువు ముగింపు అయిన బుధవారం రాత్రి 8 గంటల సమయానికి 3.30లక్షల సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అత్యధికంగా గుంటూరు జిల్లానుంచి లక్షమందికి పైగా పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. అన్ని దరఖాస్తులను రాబోయే రెండు వారాల్లో క్షుణ్ణంగా పరిశీలనచేసి అర్హత ఉన్నవారికి ఓటుహక్కు కల్పిస్తూ ముసాయిదా జాబితాలో చేరుస్తామన్నారు. ఆన్‌లైన్‌లో బాపట్ల జిల్లా నుంచి 23,707, ఏలూరు నుంచి 17,249, గుంటూరు నుంచి 1,07,088, కృష్ణాలో 59,500, ఎన్‌టీఆర్‌లో 66,690, పల్నాడులో 56,302 కలిపి మొత్తం 3 లక్షల 30వేల 536 దరఖాస్తులు అందాయి. వీటిల్లో ఏఈఆర్‌వో వద్ద 3,19,075 పెండింగ్‌లో ఉండగా ఈఆర్‌వో ఆన్‌లైన్‌లో 8,050 పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 3,385 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆమోదించారు. 26 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఆఫ్‌లైన్‌లో 13,230 దరఖాస్తులు రాగా 551 ఆమోదించారు. 12,679 పెండింగ్‌లో ఉన్నాయి. కాగా ఫారం-18 ఓటరు జాబితాలో పేరు నమోదుకోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం రాత్రితో గడువు ముగిసింది. ఆరు జిల్లాలకు సంబంధించి చివరి నిమిషంలో వచ్చిన దరఖాస్తులు క్రోడీకరించాల్సిఉంది. దీన్ని పరిగణలోకి తీసుకుంటే 3.50లక్షల సంఖ్య దాటే అవకాశం ఉన్నట్లు అంచనా. దాదాపు 3.20లక్షల ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నదృష్ట్యా గురువారం నుంచి క్షేత్రపరిశీలన ముమ్మరం చేయనున్నారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి ఆమోదించిన వాటి వివరాలను ఈఆర్‌వోకు ఏఈఆర్‌వోలు అందజేయాల్సివుంది. ఆ తర్వాత 23న ముసాయిదా ఓటర్లజాబితా ప్రచురిస్తారు. అనంతరం క్లైయిమ్‌లు, అభ్యంతరాలు చేపడతారు. అప్పుడు కూడా ఫారం-18కి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది.

నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో దందా

- వీరి అనుమతి లేకుండా లారీలకు సరుకు లోడింగ్ చేయకూడదంట..
- చేస్తే అడ్డుకొని తీరుతామని బెదిరింపులు
- తాజాగా నాలుగు లారీల టైర్లు గాలి తీసేసి అడ్డగింత

8

ఎన్జీ రంగా.. రైతు బాంధవుడు

నేడు124వ జయంత్యుత్సవాలు

అర్చకులకు పెరిగిన 'గౌరవ'ం

- రూ. 15 వేలకు వేతనం పెంపు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 362 ఆలయాలకు వర్తింపు
- ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ అమలు

6

గంజాయి విక్రేతల ముఠా అరెస్టు

- 21 కేజీల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పక్కన లాలాపేట సీఐ శివప్రసాద్, వెనుక నిందితులు

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్వ్యసనాలకు లోనై అందుకు నగదు కోసం గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 21 కిలోల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్ లాలాపేట సీఐ ఏవీ శివప్రసాద్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. సంపత్ నగర్‌లోని అప్పడాల కంపెనీ ప్రాంతానికి చెందిన కొత్తవారి సాయిచరణ్ అలియాస్ గణేష్, శారదా కాలనీ రెండోలైన్‌కు చెందిన మద్దాల చక్రపాణి, సంపత్ నగర్‌కు చెందిన షేక్ సలీం అలియాస్ హైదరాబాద్, లాలుపురానికి చెందిన దండమూడి జగదీష్ అలియాస్ డీజే, చిన్నబజారుకు చెందిన షేక్ అబ్దుల్‌రజాక్, కింగ్స్ హోటల్ పక్క వీధికి చెందిన షేక్ ఆరిఫ్‌లు ముఠాగా ఏర్పడి గంజాయి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు నిఘా పెట్టగా వీరు భద్రాచలం సీలేరు తదితర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ క్రమంలో బుధవారం ఏటుకూరు రోడ్డులో ఆరుగురుని అదుపులోకి తీసుకుని నుంచి 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సాయిచరణ్, దశరథరామిరెడ్డిలు ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్లు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. కాగా ఈ కేసులో దశరథ రామ్‌రెడ్డి అలియాస్ అబీతో పాటు మరొకరని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. గంజాయి ముఠాను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రైతుబజార్లలో ధరలకు కళ్లెం

- సేంద్రియ ఉత్పత్తుల అమ్మకాలకు స్టాల్స్
- ఆంధ్రజ్యోతితో మార్కెటింగ్ ఏడీ రాజబాబు



గుంటూరు సిటీ, నవంబరు 6: ప్రజలకు, రైతులకు మధ్య వారధిలాంటి రైతు బజార్లు నిర్వాహణపై పలు ఆరోపణలు వస్తున్నాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, శుభ్రత లేదని, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉన్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా రైతుబజార్లలో దళారుల బెడద ఎక్కువగా ఉందన్న వాదన లేకపోలేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 11 రైతు బజార్ల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలపై మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ బూసిమి రాజబాబుతో 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.

ధరల నియంత్రణకు చర్యలు

రైతుబజార్లలో ధరల నియంత్రణపై ప్రైస్ మానిటరింగ్ కమిటీ కలెక్టర్ నేతృత్వంలో ప్రతి నెల సమావేశం జరుగుతుంది. రైతుబజార్లలో అధిక ధరలు వసూలు చేయడం కుదరదు. నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేసేందుకు ముఖ్యమైన సరుకులను నో ప్రాఫిట్.. నో లాస్.. పాలసీ మీద రైతుబజార్లలో విక్రయిస్తున్నాం. టమాటా, ఉల్లిపాయల ధరలు పెరిగినప్పుడు ఇదే పద్ధతిలో విక్రయించాం. ఇక్కడ ఎక్కువ ధర ఉండే వాటిని అవి పండే ప్రాంతం నుంచి ప్రత్యేకంగా తెప్పిస్తాం. గుంటూరులోని కొన్ని రైతు బజార్లలో పాడైన డిజిటల్ ధరల బోర్డుల మరమ్మతులు చేయిస్తాం.

సబ్సిడీకి నిత్యావసరాలు

ప్రస్తుతం రైతుబజార్లలో వంట నూనెలను తక్కువ ధరకు విక్రయిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. ఇక్కడ నూనె ప్యాకెట్ ధర మార్కెట్ కంటే తక్కువే ఉంటుంది. రైతు బజార్ల నుంచి నెలకు సగటున రూ.15 లక్షల ఆదాయం వస్తుంది.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

రైతుబజార్లలోని మరుగుదొడ్ల నిర్వహణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడటం లేదు. ప్రతి వారం స్వయంగా తనిఖీ చేస్తాను. ప్రతి రైతుబజారు నిర్వహణకు ఒక ఆఫీసర్‌ని ఏర్పాటు చేశాం. అపరిశుభ్రతపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. స్థానికంగా పోగయ్యే చెత్తా చెదారం వేయడానికి ప్రత్యేక బిన్లను ఏర్పాటు చేయించాం.

సేంద్రియ ఉత్పత్తుల అమ్మకాలు

సేంద్రియ ఉత్పత్తుల విక్రయాల కోసం ప్రతి రైతు బజార్‌లో ప్రత్యేకంగా ఒక షాపు కేటాయించాం. కానీ ఎవరూ వాటిని తీసుకోవడం లేదు. సేంద్రియ ఉత్పత్తులు అమ్మే వారు వాటిని వినియోగించుకోవచ్చు.

రైతుల కోసం విశ్రాంతి గదులు

గతంలో నిర్మించిన రైతు బజార్లలో రైతులకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులు లేవు. నూతనంగా నిర్మించే వాటిలో రైతుల కోసం ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, సెల్‌చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశాం. రైతు బజార్లలో దళారులను ప్రోత్సహించే అవకాశమే లేదు.

జిల్లాలో 112 మందికి కార్డులు

రైతు బజార్లలో అమ్మకాలు జరిపేందుకు రైతులు కార్డులు ఎప్పుడైనా తీసుకోవచ్చు. ప్రస్తుతం జిల్లాలో 112 మందికి ఈ కార్డులు ఉన్నాయి. కొత్తగా కార్డులు కావాలంటే మొదట పంట భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారుల వద్ద సర్టిఫికెట్ తీసుకోవాలి. ఆ తర్వాత హార్టికల్చర్ అధికారి నుంచి సర్టిఫికెట్ తెచ్చుకుంటే మేము రైతు కార్డు మంజూరు చేస్తాము.



ఇంటర్ విద్యలో సమూల మార్పులు

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ఏడాది ఇప్పటి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వం వచ్చే ఏడాది ప్రతి మండలంలో కనీసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా కళాశాలల్లో మెరుగైన శిక్షణ ఇవ్వడంతోపాటు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల ఇంటర్ బోర్డు అధికారులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమీక్షలో నూతన విద్యావిధానాలపై విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించారు.

- వచ్చే ఏడాది నుంచి మండలానికో జూనియర్ కళాశాల
- భారీ అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక
- ఇంటర్ కళాశాలల్లో ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షలకు శిక్షణ
- ఈ ఏడాది ఇప్పటికే ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పంపిణీ



గుంటూరు(విద్య)నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ఇప్పటికే 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రస్తుతం 15వేలమందికిపైగా విద్యార్థిని విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. అంటే ఇంకా దాదాపు సగం మండలాల్లో ప్రభుత్వ లేదా ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు లేవు. ఈనేపథ్యంలో జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో కొత్తగా కళాశాలలు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. ఇందుకు ప్రైవేటువిద్యాసంస్థల్ని ప్రోత్సహించి త్వరితగతిన అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు జాతీయస్థాయిలో పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రస్థాయిలో జరిగే ఎంసెట్‌తోపాటు, జాతీయ స్థాయిలో జరిగే నీట్, జేఈఈ మెయిన్స్‌అడ్వాన్స్‌పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అంతేకాకుండా

(మిగతా 8వ పేజీలో..)

అర్చకులకు పెరిగిన 'గౌరవ'ం

- రూ. 15 వేలకు వేతనం పెంపు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 362 ఆలయాలకు వర్తింపు
- ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ అమలు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. ఆదాయం లేని చిన్న ఆలయాలకు పెద్ద ఊరట కల్పిస్తుంది. చిన్న ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులకు గౌరవ వేతనాన్ని పెంచింది. గతంలో ఇస్తున్న దాని కంటే మూడింతలు పెంచి, వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 362 దేవాలయాలను ఎంపిక చేసి, అందులో పని చేస్తున్న అర్చకులకు నెలకు రూ.15 వేలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అర్చకులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బ్రాహ్మణ సంక్షేమానికి సహాయ, సహకారాలు అందిస్తూ, వారికి ఆర్థికంగా చేయూతనిస్తున్నారు.

రూ. 50 వేల ఆదాయం పైబడిన దేవాలయాలకు..

దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని చిన్న ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు మూడింతలు జీతం పెంచారు. వాస్తవానికి ఈ ఆలయాలకు అతి తక్కువ ఆదాయం ఉంటుంది. ఏడాదికి ఆలయ ఆదాయం రూ. 50 వేల నుంచి రెండు లక్షల లోపు ఉంటుంది. ఇలాంటి ఆలయాలకు గతంలో సరైన ఆదరణ లేదు. ధూప దీప నైవేద్యం కూడా లేని పరిస్థితులు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం గతంలో కొన్ని ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఆలయాల్లో దేదీప్యమానంగా సంవత్సరాంతం చక్కగా పూజలు జరుగుతున్నాయి. దీంతోపాటు అదనంగా మరికొన్ని ఆలయాలకు చేయూతనిస్తూ, అందులో పని చేస్తున్న అర్చకులకు భారీగా జీతాలు పెంచారు. గతంలో నెలకు రూ.6వేలు తీసుకునే అర్చకుడు ఇప్పుడు రూ.15 వేలు తీసుకోనున్నారు.

మూడు జిల్లాల్లో 362 ఆలయాలకు వర్తింపు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మొత్తం 362 చిన్న ఆలయాలకు వర్తింప చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో 107, బాపట్ల జిల్లాలో 128, పల్నాడు జిల్లాలో 127 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు నెలకి రూ. 15 వేలు గౌరవ వేతనంగా చెల్లించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1683 ఆలయాలను ఎంపిక చేశారు.



గుంటూరు దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయం

జీవో జారీ..

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎన్డీఏ నేతలు హామీ ఇచ్చారు. అ హామీలో భాగంగానే అర్చకుల సంక్షేమానికి చేయూతను అందిస్తున్నారు. ఇప్పటికే ఆదాయం లేని ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకం కింద నెలకు రూ.10 వేలు చొప్పున అందిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం తక్కువగా ఉన్న చిన్న ఆలయాలను 6 (సీ-2) గుర్తించి, అందులో పని చేస్తున్న అర్చకులకు నెలకు రూ. 15 వేలు చెల్లించే విధంగా జీవో ఎంఎస్ నంబర్ 261ని బుధవారం జారీ చేసింది. దీంతో ఆ ఆలయాల్లో పనిచేస్తున్న బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



రాష్ట్రంలో చిన్న దేవాలయాలకు ఆదాయం లేదు. దీనిని గుర్తించిన ప్రభుత్వం చేయూత ఇచ్చేందుకు కృషి చేయటం అభినందనీయం. ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. చిన్న ఆలయాల్లో పని చేస్తున్న పేద బ్రాహ్మణుల ను ప్రభుత్వం ఈ విధంగా ఆదుకోవడం సంతోషకరం.

- దేవదాయ శాఖ డీసీ కేబీ శ్రీనివాసరావు

ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా జీతాల్లో కోత అన్యాయం

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా జీతాల్లో కోత విధించటం అన్యాయం అని ఏపీ హంస అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణ బాబుని కలిసిన హంస అసోసియేషన్ నేతలు వినతి పత్రం సమర్పించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు ఆధారంగా కోత విధించిన జీతాలు తిరిగి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కొత్తగా రెగ్యులర్ అయిన ఉద్యోగుల ప్రొబేషన్ ఒక సంవత్సరానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. హంస అసోసియేషన్ నేతల విజ్ఞప్తిపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణ బాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఏపీ హంస అసోసియేషన్ స్టేట్ అధ్యక్షుడు ఆరవ పాల్, సెక్రటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్, జిల్లా అధ్యక్షుడు బి.నాగ వర్ధన్, మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

కొలనుకొండ బైపాస్‌లో మహిళలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- తీవ్ర గాయాలు
- మంత్రి సవిత మానవత్వం



ఎన్నారై వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ వద్ద మంత్రి సవిత

తాడేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి హైవేపై కొలనుకొండ వద్ద బుధవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న నలుగురు మహిళలను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న మంత్రి ఎస్ సవిత తన మానవత్వాన్ని చాటుకుని గాయపడిన వారిని తన వాహనంలో స్వయంగా దగ్గరుండి ఎన్నారై వైద్యశాలకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి..... తాడేపల్లి సమీపంలోని కొలనుకొండ ప్రాంతంలో కూలిపనులకు వచ్చిన నలుగురు మహిళలు హైవే దాటుతుండగా విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. దీంతో వారంతా తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అదే సమయంలో అటుగా వెళుతున్న మంత్రి సవిత స్పందించి క్షతగాత్రులను తన వాహనంలో ఎన్నారై వైద్యశాలకు తరలించి ఆమె కూడా మరో వాహనంలో వారి వెనుకనే ఎన్నారై వైద్యశాలకు వెళ్లి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఓ మహిళ పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు తెలిపారు. తక్షణమే స్పందించి క్షతగాత్రులను తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించిన మంత్రి సవితపై వాహనచోదకులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు. గాయపడిన వారు ఆదిలక్ష్మి, నారాయణమ్మ, సరస్వతి, నారాయణమ్మగా స్థానికంగా ఉండే జయభేరి సిబ్బంది తెలిపారు. గాయపడిన వారు వివరాలు వెల్లడించే పరిస్థితిలో లేరు. వీరిని విజయవాడకు చెందిన వారిగా భావిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అటుపిమ్మట ఎన్నార్ వైద్యశాలకు వెళ్లి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ రోడ్డు ప్రమాదంతో తాడేపల్లి హైవేపై కిలో మీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

రూ. 10 వేలు జరిమానా

గుంటూరు(లీగల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష, నలుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ గుంటూరు 5వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కె.లత బుధవారం తీర్పు చెప్పారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ. అశోక్ కుమార్ తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ రైడ్ నిర్వహించి ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడుగురిని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు 5వ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చారు. ఈ కేసులను విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

50,326 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 54,072 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,326 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,952 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	9000	15000
నెంబరు. 5	9500	13500	నెంబరు. 5	10000	12000
273	10300	12300	273	13500	13500
341	8500	15000	341	8200	16300
4884	9000	13500	4884	11000	12500
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17200	తేజ	8500	17200
బ్యాడిగి	8000	14000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	10800

సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

(5పేజీ తరువాయి)

ఈదులపాలెం, నడింపాలెం, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, గొట్టిపాడు, కొండ జాగర్లమూడి, గనికెపూడి, పెదనందిపాడులో గొరిజవోలు గుంట పాలెం, యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, ఉన్నవ, కొండవీడు, సొలస, వంకాయలపాడు, మైదవోలు, యడ్లపాడు, విశ్వనాధుని కండ్రిక, జాలాది, తిమ్మాపురం, కారుచోల, నాదెండ్ల మండలంలోని నాదెండ్ల, ఫిరంగిపురం మండలంలోని హవుసు గణేష, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్, నుదురుపాడు, వేమవరం, బేతపూడి, తాళ్లూరు, యర్రగుంట్లపాడు, సిరంగిపాలెం, తక్కెళ్లపాడు, ముప్పాళ్ల మండలంలోని మాదల, సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు, నందిగామ, కంటెపూడి, భీమవరం, కంకణాలపల్లె, గుడిపూడి, ఫణిదం, అబ్బూరు, పాకాలపాడు, రెంటపాళ్ల, గోరంట్ల, కట్టమూరు, భట్లూరు, వడ్డవల్లి, పెదకూరపాడు మండలంలోని అన్ని గ్రామాలు, అచ్చంపేట మండలంలోని కస్తల అగ్రహారం, కోనూరు, ఓర్వకల్లు, అంబడిపూడి, వేల్పూరు, చిగురుపాడు, మిట్టపాలెం, పెదపాలెం, చామర్రు, అచ్చంపేట, నీలేశ్వరపాలెం, తాళ్లచెరువు, చింతపల్లి, కోగంటివారిపాలెం, క్రోసూరు మండలంలోని అనంతవరం అగ్రహారం, క్రోసూరు, విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, పారుపల్లి, పీసపాడు, అందుకూరు, బాలెమర్రు, ఉయ్యందన ఏపీసీఆర్‌డీఏలోకి వచ్చాయి.

సీఆర్‌డీఏ ప్రస్థానం..

2014లో ఏపీసీఆర్‌డీఏ ఏర్పడింది. గుంటూరు, ఏలూరు, ఎన్‌టీఆర్, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలతో దీని కూర్పు జరిగింది. అంతకుముందు ఉన్న వీజీటీఎం ఉడాని రద్దు చేసి పరిధిని పెంచి సీఆర్‌డీఏని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో జోన్లను కూడా ఏర్పరిచింది. అవుటర్ రింగురోడ్డుని కూడా ఎలైన్‌మెంట్ చేసి నిర్మాణం చేపట్టే సమయంలో ఎన్నికలు జరిగి 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే జీఎన్ రావు కమిటీ అని ఏర్పాటు చేసి మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అందుకు అనుగుణంగా 2020లో ఏపీసీఆర్‌డీఏ బిల్లుని రద్దు చేసింది. దీనిపై అమరావతి రాజధాని పరిరక్షణ సమితి రైతులు ఉద్యమించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో కేసులు వేసి పోరాడారు. ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు స్టే విధించింది. అంతేకాకుండా ఏపీసీఆర్‌డీఏ చట్టం రద్దు చెల్లదని తీర్పు ఇచ్చింది. దాంతో వైసీపీ ప్రభుత్వం 2021లో సీఆర్‌డీఏ చట్టాన్ని పునరుద్ధరించింది. అయితే అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టకపోగా మరోవైపు సుప్రీం కోర్టులో రివిజన్ పిటీషన్ దాఖలు చేసింది.

ఆ మండలాలకు మహర్దశే

కూటమి ప్రభుత్వంలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతుండడంతో పాటు కేంద్రం నుంచి నిధులు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీంతో రాజధాని ప్రాంతంలో వివిధ పనులు చకాచకా జరుగుతున్న సంగతి తెలిసిందే. సీఆర్‌డీఏ పరిధిలో పలు ప్రాజెక్టులు భవిష్యత్తులో క్యూ కట్టనున్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాలు సీఆర్‌డీఏలోకి వెళ్లాయి. దీంతో ఆయా గ్రామాల్లో కూడా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అక్కడి ప్రజలు భావిస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది

వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందాన్ని ఇచ్చింది. గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం కక్షసాధింపే అజెండాగా తీసుకున్న తలాతోక లేని నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. సీఆర్‌డీఏ పరిధిని కూటమి ప్రభుత్వం విస్తరించింది.

-నక్కా ఆనంద్‌బాబు, వేమూరు ఎమ్మెల్యే

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

బాపట్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం బాపట్ల మండలం వెదుళ్లపల్లి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాని, నందిరాజుతోట హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

తొలిరోజు ఆంధ్ర జట్టుదే పైచేయి



ఎం.యువన్



లోహిత్

మంగళగిరి సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం నుంచి కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీ ప్రారంభమైంది. ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య నాలుగు రోజులపాటు జరగనున్న మ్యాచ్‌లో తొలిరోజు ఆంధ్ర జట్టు పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఆంధ్ర బ్యాటర్లు ఎం.యువన్ 117 బంతుల్లో 9 సిక్సర్లు, 5 ఫోర్లతో 122 పరుగులు, లోహిత్ లక్ష్మీనారాయణ 166 బంతుల్లో 6 సిక్సర్లు, 12 ఫోర్లతో 113 పరుగులు సాధించారు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ 32 ఓవర్లలో 114 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. కూచ్ బెహర్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు గ్రూప్-డిలో ఆడుతుంది. ఆంధ్ర జట్టు ఆడనున్న ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌లు మంగళగిరి ఏసీఏ మైదానంలో జరగనున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 586.30 అడుగులు ఉంది. ఇది 301.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4679 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,979 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 12,827 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది

నూతన ఓటర్ల నమోదు ప్రక్రియపై పునరాలోచించాలి

● ప్రైవేటు స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు రాజామాస్టారు

గుంటూరు(విద్య),నవంబరు 6: నూతన ఓటర్ల నమోదుపై ఎన్నికల కమిషన్ పునరాలోచించాలని ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ నాయకుడు రాజామాస్టారు పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎస్‌టీయూ ఎన్నికల్లో పోటీ చేయడమా, కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వడమా అనేది త్వరలో నిర్ణయిస్తామని తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.10వేలు ఇవ్వాలని, ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సమస్యలు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భాస్కరరావు, సుబ్బారావు, దివాకర్, వెంకటరెడ్డి, గౌసియా బేగం, ఆలపాటి విజయ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణా తరగతులపై పునరాలోచించాలి

● ఎన్‌టిఎ రాష్ట్ర కార్యదర్శి బీ హైమారావు

గుంటూరు(విద్య),నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అందించే రెసిడెన్షియల్ శిక్షణపై మరోసారి పునరాలోచించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బీ హైమారావు, అధ్యక్షులు నడిపినేని వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి ఉందని, డివిజన్ స్థాయిలో శిక్షణా తరగతుల్ని ఏర్పాటు చేసి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని కోరారు. శిక్షణా తరగతుల్లో మరణించిన ప్రధానోపాధ్యాయుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా శిక్షణా తరగతులను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మండల స్థాయి అధికారులకు శిక్షణ

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కోసం రూపొందిస్తున్న ప్రణాళికల్లో పనులు ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ జేడీ ఆర్ కేశవరెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఒక్కరు టెక్నికల్‌గా చేయాల్సిన విధివిధానాలను నేర్చుకొని ప్రతి సందేహం నివృతి చేసుకొని శిక్షణ ఫలవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా పంచాయతి అధికారి ఎంవీ భాస్కరరెడ్డి సమన్వయం చేశారు. డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, జీవన్, రవీంద్రబాబు, దయాసాగర్ పద్మరాణి, మేనేజర్ కే నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్‌బాబు

ఎఫ్ఎల్ఎన్, స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ రద్దు చేయాలి

గుంటూరు(విద్య),నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం మధ్యలో శిక్షణ ఇవ్వడం వల్ల ప్రధానోపాధ్యాయుల నామినల్ రోల్స్ నిర్వహణ భారంగా మారిందని ఏపీఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు.స్థానిక కంకరగుంటలోని ఎస్టీయు భవన్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్, స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ రద్దుచేయాలని, పని ఒత్తిడితో ప్రధానోపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 50 ఏళ్ల పైబడిన వారికి శిక్షణా కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షకార్యదర్శులు డీపెద బాబు, డీకే సుబ్బారెడ్డి, మల్లప్రసాద్‌రావు, కే శ్రీనివాసరావు, శ్యాం బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక ఏకాదశికి అరుణాచలంకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అరుణాచలం క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ నెల 7, 14 తేదీల్లో సికింద్రాబాద్ - విల్లుపురం ప్రత్యేక రైలు రాత్రి 7.40కి బయలుదేరి 10.28కి నడికుడి, 11.10కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.10కి గుంటూరు, 1.03కి తెనాలి, 1.58కి చీరాల, మరుసటి రోజు ఉదయం 11.15కి తిరువణ్ణామలై(అరుణాచలం), మధ్యాహ్నం 1.05కి విల్లుపురం చేరుకొంటుంది. నెంబరు. 07602 విల్లుపురం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 8, 15 తేదీల్లో సాయంత్రం 4.05కి బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 3 గంటలకు గుంటూరు, 3.49కి సత్తెనపల్లి, 4.49కి నడికుడి, ఉదయం 9.45కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. ఈ రైళ్లలో ఏసీ ఫస్టు క్లాస్ కంటూటైర్, ఏసీ టూటైర్, ఏసీ త్రీటైర్, 12 స్లీపర్, నాలుగు జనరల్ రెండు బ్రేక్ వ్యాన్‌లు ఉంటాయి.

9, 10 తేదీల్లో నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటిపాడు ఎల్వీఆర్ క్లబ్ వేదికగా గుమ్మడి శ్రీమన్నారాయణ మూర్తి, వైకే నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో ఈనెల 9, 10 తేదీలలో నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళా పరిషత్ సభ్యులు కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహా రావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శనలు జరుగుతాయని అన్నారు. 9న మనః సాక్షి, హెచ్చరిక, 10న ఒరి వీళ్ల నటన పాడు గాను, బంధం నాటికలను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రంగస్థల నటులు చలసాని కృష్ణప్రసాదు, ఎస్ఎం బాషా, దేవిరెడ్డి రామకోటేశ్వరరావులకు ఆత్మీయ పురస్కారాలు అందజేయనున్నట్టు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

● కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

గుంటూరు(తూర్పు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో విద్యారంగంలో జరిగిన తప్పులను పరిష్కరించడానికి నూతన ప్రభుత్వం, విద్యా మంత్రి నారా లోకేష్ చొరవ చూపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ అశోక్ అన్నారు. కేబి నెట్‌లో విద్యారంగ సమస్యలపై చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే విద్యా రంగాన్ని ప్రక్షాళన చేస్తానని నారా లోకేష్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అమ్మకు వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలపై స్పష్టత ఇవ్వాలని, 'విద్యా దీవెన', 'వసతి దీవెన' బిల్లులను గత ప్రభుత్వం చెల్లించలేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లను విడుదల చేయాలని, ఉన్నత చదువులవిద్యార్థులకు శాపంగా మారిన జీవో నం77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ మాట్లాడుతూ 2014లో ప్రవేశపెట్టిన జూనియర్ కళాశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్, మెస్ బిల్లు లను విడుదల చేయాలని, రాష్ట్రంలో ఉన్న ఖాళీగా ఉన్న 3,220 అధ్యాపక పోస్టు లను తక్షణమే భర్తీ చేయాలని, నగరంలో ఉన్న కోడిగుడ్డ సత్రాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలనికోరారు. ధర్నాలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు షేక్ సమీర్, సమిత, యశ్వంత్, అభి, జమీర్, షంషీర్, రాజ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

గత ప్రభుత్వ పాపాలతో పేదలకు ఇబ్బంది

● శారదాకాలనీ ఒకటో లైన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి జగనన్న కాలనీల పేరుతో పేదలను మోసం చేసిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. గుంటూరు పశ్చిమలోని 49వ డివిజన్‌లోని శారద కాలనీ ఒకటో లెన్‌లో ఆమె పర్యటించారు. శారద కాలనీలో సుమారు 120 కుటుంబాలు కాలువల మీద ఇళ్ళు నిర్మించుకొని జీవిస్తుండగా, వాటిని తొలగించమని మున్సిపల్ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమే స్వయంగా వారి పరిస్థితులను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద ముప్పు నుంచి ఈ ప్రాంత వాసులు బయటపడాలంటే డ్రెయిన్ ఆక్రమణలు తొలగించాల్సిందేనని చెప్పారు. అయితే, బాధితులయ్యే నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారికి గత ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో జగనన్న కాలనీల పేరిట ఇళ్ళు మంజూరు చేసి, నేటికీ వారికి పూర్తి చేసి ఇవ్వలేదన్నారు. ఇళ్ల నిర్మాణం మొత్తం నాసిరకంగా ఉండటమే కాక, కనీస మౌలిక సదుపాయాలూ కూడా కల్పించలేదని, అందుకే, పేదలు అక్కడికి వెళ్లేందుకు ఇష్టపడటం లేదని విమర్శించారు. వారికి కేటాయించిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో టీడీపీ నాయకులు మద్దిరాల మ్యాని, సుధీర్, వేణు, నంది సరస్వతి పాల్గొన్నారు.


కొత్తగా కొనుగోలు చేసిన డంబర్‌బిన్‌లతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

● పశ్చిమను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతా

గుంటూరు పశ్చిమను పరిశుభ్రమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. అవసరమనుకుంటే స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటామని, స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ద్వారా చెత్తపై యుద్ధం చేసి, విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్పెషల్ శానిటరీ డ్రైవ్‌కి తన వంతు సహకారం అందించాలన్న లక్ష్యంతో టీడీపీ నాయకురాలు నంది సరస్వతి సౌజన్యంతో 5 డంబర్ బిన్ల (చెత్త కుండి) కొనుగోలుకు రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యేకి అందజేయగా, వెంటనే డంబర్ బిన్స్ కొనుగోలు చేసి వేలాంగిణినగర్, భరత్‌పేట, శారదా కాలనీలలో వీటిని ఏర్పాటు చేశారు.



ఐసీడీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

మాతా, శిశు మరణాలు లేకుండా చేద్దాం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, అందుకోసం మాతా, శిశు మరణాలు లేకుండా చేసేందుకు కృషి చేద్దామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 167 అంగన్వాడీ కేంద్రాలు, 6 సెక్టార్లు ఉన్నాయని, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, మాతా శిశు మరణాలు తగ్గించడంలో, ఆరేళ్ల లోపు పిల్లల ఆరోగ్యస్థితిని పెంపొందించే పోషణ అందించడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. మహిళ గర్భవతి అయిన దగ్గర నుంచి ప్రసవం అయ్యే వరకు, 6 నెలల వరకు బాలింతలకు, మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు శారీరక,మానసిక ఆరోగ్యం పెంపొందించ దానికి అవసరమైన పోషకాహారం, బాలామృతం, పాలు, కోడిగుడ్లు ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని సుమారు 23 వేల మంది లబ్దిదారులకు ఈ సౌకర్యం కలగజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీదేవి, సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ నోటీసులు విడుదల చేయాలి

గుంటూరు(విద్య),నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వచ్చే విద్యాసంవత్సరం పదవీ విరమణ చేసే వివిధ క్యాడర్ ఉపాధ్యాయుల వివరాలు వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే బసవలింగారావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు డీఈవో సీవీ రేణుకకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వారి పెన్షన్ బెనిఫిట్స్ అందేలా చూడాలని కోరారు.


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిప్స్‌లో ఔషధ మొక్కల ప్రదర్శన

గుంటూరు(విద్య),నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మా స్యూటికల్ సైన్సెస్‌లో బుధవారం ఔషధ మొక్కల ప్రదర్శన నిర్వహించారు. మొక్కల ప్రాధాన్యతపై విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ సూర్యదేవర విద్యాధర మాట్లాడుతూ ఏయే మొక్కలను ఎటువంటి ఔషధాల తయారీకి ఉపయోగిస్తారనే దానిపై అవగాహన ఉండాలన్నారు. జేకేసీ, సిబార్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థినులు

అర్చకుల వేతనం పెంపుపై హర్షం

గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): దేవాదాయ శాఖపరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు కనీస వేత నాన్ని రూ.10 వేల నుంచి 15 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై అర్చక జేఏసీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంధ్యాల వెంకట రామ లింగేశ్వర శాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. గుంటూరులో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే చెప్పిన హామీ లన్నీ నెరవేరుస్తూ డీడీఎన్ఎస్ పథకానికి రూ.5వేల నుంచి రూ. 10వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని అన్నారు


బిల్డింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తదితరులు

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

గుంటూరు(విద్య),నవంబరు 6: బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని ఈ ఏడాది డిసెంబర్ 15లోగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. ఈ భవనాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. దీని నిర్మాణానికి రూ.2.10 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.90 లక్షలు అవసరం అవుతాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీ అనిల్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ మొత్తాన్ని సాంఘిక సంక్షేమశాఖ గ్రాంటు నుంచి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయాన్ని ఆమె పరిశీలించారు. లైబ్రరీలో ఫ్యాన్లు, లైట్లు సమస్య ఉందని సిబ్బంది ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తూర్పు తహ సిల్దార్ నగేష్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెంచులక్ష్మి పాల్గొన్నారు.

నెలాఖరుకి ప్యాచ్‌వర్క్‌లు పూర్తి: కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నవంబరు నెలాఖరు నాటికి రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ మేరకు పనులు వేగంగా జరుగుతున్నాయని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు నగరంలో జరుగుతున్న మరమ్మతు పనులపై డివిజన్ల వారీగా ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రహదారులపై వార్డ్ సచివాలయాల వారీగా 3 వేల వరకు ప్యాచ్ లు, రోడ్డు మరమ్మతులు చేయాల్సిన వాటిని గుర్తించామని, వాటికి డివిజన్ల వారీగా సుమారు రూ.2.56 కోట్లతో అంచనాలు సిద్ధం చేసుకొని, డిసెంబర్ 15 నాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే సుమారు 12 వందల ప్యాచ్ వర్క్ లు పూర్తి చేశామన్నారు. స్థానిక బ్రాడీపేట 4వ లైన్ లో నూతన బీటీ రోడ్డుని ఎండ్ టు ఎండ్ ఏర్పాటు చేస్తున్నామని, నందివెలుగు రోడ్డు ఏర్పాటుపై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశామన్నారు. అలాగే, నగరంలోని నల్లచెరువు మెయిన్ రోడ్, విబిపి రోడ్, పాత గుంటూరు బాలాజీ నగర్, తారకరామనగర్, అంబేద్కర్ నగర్, ఆనందపేట, సంగడి గుంట, లాంచేస్టర్ రోడ్, ఐపిడి కాలనీ, ఎస్విఎన్ కాలనీ, బ్రాడీపేట బ్రిడ్జి సర్వీస్ రోడ్డు, ముత్యాల రెడ్డి నగర్, దేవాపురం, కోబాల్ట్ పేట వంటి పలు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన రోడ్ మరమత్తు పనులు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. రోడ్డు మరమ్మతులతో పాటు ఎక్కడైనా ప్రజల అవసరాల రీత్యా నూతన డ్రెయిన్లు, కల్వర్ట్ ల నిర్మాణ అవసరాలను గుర్తిస్తే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పామన్నారు.. ఏఈల వారీగా ప్యాచ్ వర్క్ పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ చేయాలని, లోపాలు వస్తే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు బాధ్యత వహించాలని అన్నారు.



మెప్మా ఒక రోజు వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న పీడీ

యాప్‌లో డేటా నమోదు చేయాలి: మెప్మా పీడీ విజయలక్ష్మి


గుంటూరు సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో జరుగు తున్న అవకతవకలను అరికట్టేం దుకు మిషన్ డైరెక్టర్ చొరవతో తీసుకువచ్చిన యాప్‌లో ప్రతిరోజూ రెండు స్వయం సహాయక సం ఘాల డేటా నమోదు చేయాలని మెప్మా పీడీ టీవీ విజయలక్ష్మీ అన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జిల్లా స్థాయి మహిళా స్వయం సహాయక సంఘం సమగ్ర సమాచారం క్షేత్ర స్థాయిలో సేకరించేందుకు బుధవారం వర్క్ షాప్ నిర్వహిం చారు. పీడీ మాట్లాడుతూ 10 మంది గ్రూపు సభ్యులు అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే వారి సమాచారం యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. యాప్‌లో సమాచారం ఆధారంగానే మహిళలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు.

జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డితో రేపు ఇష్టాగోష్టి

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీ బ్రహ్మారెడ్డితో అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఈ నెల 8న ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలపై ఆయన విశ్లేషణ చేస్తారని, దేశ రాజకీయాల్లో వస్తోన్న గుణాత్మక మార్పులపై ఆయన ప్రసంగిస్తారని తెలిపారు

రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన: డీటీసీ సీతారామిరెడ్డి

గుంటూరు(తూర్పు), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారి నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని జిల్లా ఉపరవాణ కమిషనర్ కే సీతారామిరెడ్డి అన్నారు. స్థానిక స్వర్ణ భారతీనగర్‌లోని రవాణ శాఖ కార్యాలయంలో బుధవారం డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రామిరెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. సరైన పత్రాలు లేకపోతే వాహనాన్ని సీజ్ చేస్తామని, రోడ్డుప్రమాదాల నివారణకు వాహన డ్రైవర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణ అధికారి బీ సత్యనారాయణ, అధికారులు గోపాల్, మల్లీశ్వరీ, జె అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కే సీతారామిరెడ్డి, పాల్గొన్న వాహన డ్రైవర్లు

శివదండకంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందా వన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం ప్రముఖ ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావు శ్రీ మదాంధ్ర మహాభారతాంతర్గత అర్జున స్తుత శివదండకం పై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. కోటేశ్వరరావు ప్రవచిస్తూ ఒకా నొకప్పుడు వ్యాసభగవానుడు పాండవులతో మీరు యుద్ధంలో కౌరవులపై గెలవాలంటే శివానుగ్రహం తప్పకుండా ఉండాలన్నారు. శివదండకము చదువుకుని బయలుదేరిన వారికి జటిలమయిన సమస్యలు తీరి కార్యసిద్ధి కలుగునని ఆశీర్వచనం చేస్తారన్నారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తా నయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సత్సంగ సభ్యులు జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


ప్రవచనం చేస్తున్న కోటేశ్వరరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

పవన్ ఆలోచనా విధానం.. రాష్ట్రాభివృద్ధికే

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ ఆలోచనా విధానాన్ని అందు కునేందుకు వైసీపీ నాయకులు సరిపోరని, తమ అధినేత దృష్టి అంతా రాష్ట్రాభివృద్ధి, ప్రజా శ్రేయస్సుపైనే ఉందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు.స్థానిక లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులు, హోం మంత్రి మరింత బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ సీఎం పవన్ సూచిస్తే, దీనిపై వైసీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పవన్ సూచనలను డీపీజీ, హోం మంత్రి స్వీకరించారని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. పల్నాడు జిల్లాలో సరస్వతి పవర్ భూములను పవన్ సందర్శించకూడదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేయడం హాస్యాస్పదమన్నారు. గురజాల శాసన సభ్యుడుగా పని చేసిన కాసు మహేష్‌రెడ్డికి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఎక్కడుందనీ, ఆయనకు సిగ్గు, ఎగ్గూ ఉన్నాయా అని గాదె ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్లు ఈ ప్రాంతాన్ని దోచుకుతిన్నారని, అక్కడ రోడ్లపై గుంతలు తప్పా అభివృద్ధి అనేది కనపడదని ఎద్దేవా చేశారు. క్వారీపాడులో సర్వే చేయకుండా 144 ఎకరాల భూమిని ఆక్రమించింది ఎవరో పల్నాడు ప్రజలకు తెలుసని ఆయన విమర్శించారు. పవన్ కల్యాణ్‌పై మంద కృష్ణమాదిగ వ్యాఖ్యలు సరికాదని, పవన్ కుల, మతాలకు అతీతంగా ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడుతున్న నాయకుడని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని గాదె అన్నారు. సమావేశంలో జనసేన కృష్ణా, పెన్నా రీజియన్ మహిళా కోఆర్డినేటర్ పాకనాటి రమాదేవి, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నేతలు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, శిఖా బాలు, చట్టాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపును అడ్డుకున్న దళిత,బహుజన సంఘాలు

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బొంగరాల బీడు శ్మశాన వాటిక వెనుక ఉన్న యానాదికాలనీలో అనధికారిక గుడిసెలను తొలగించేందుకు వచ్చిన నగరపాలక సంస్థ సిబ్బందిని కొందరు దళిత, బహుజన సంఘాల నాయకులు ఘెరావ్ చేశారు. దశాబ్దానికి పైగా ఇక్కడే గుడిసెలు వేసుకొని జీవనం సాగి స్తున్న తమను ఉన్నపళంగా వెళ్ళి పొమ్మంటే ఎలా అంటూ ఆందోళనకు దిగారు. తమకు నీడ కల్పించేందుకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని, అప్పటి వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులను కూడా తెలియజేశామని, మరొకసారి కలుస్తామని చెప్పడంతో నగరపాలక సంస్థ సిబ్బంది తాత్కాలికంగా వెనుదిరిగారు.


యానాది కాలనీ వద్ద నిరసన తెలియజేస్తున్న దళిత, బహుజన సంఘాల నాయకులు

ప్రభుత్వ ఉద్యోగులపై రహస్య నివేదికలు పంపే విధానంపై అవగాహన

● ఈదర వీరయ్య

గుంటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులపై ఏడాదికి ఒకసారి ఉన్నతాధికారులకు రహస్య నివేదికలు పంపే విధానం గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సబార్డినేట్ సర్వీసులోని సభ్యులందరికి పర్సనల్ ఫైళ్ళను నిర్వహించాలని, ఏపీ మినిస్టీరియల్ సర్వీసుకు చెందిన లోయర్ డివిజన్ గుమస్తాల పర్సనల్ ఫైళ్ళను ఫుల్‌స్కేపు కాగితాలతో తయారు చేసి గోధుమ రంగు, జాకెట్లతో కుట్టాల్సి ఉంటుందన్నారు. లేక ట్యాగ్ చేయాలన్నారు. ఆ పుస్తకంలో ఏదైనీ నమోదు చేసినప్పుడు ఆ అభిప్రాయం ఏ కలానికి సంబంధించినది రికార్డులు అధీనంలో ఉంచుకొనే అధకారి పేరు ఆయన హోదా స్పష్టంగా రాయాలన్నారు. ఒక లోయర్ డివిజన్ గుమస్తా అప్పర్ డివిజన్ గుమస్తాగా ప్రమోషన్‌కు అర్హుడని ఉన్నతాధికారి అంగీకరించినప్పుడు అతని పర్సనల్ రికార్డును పూర్తి చేసి ఉన్నతాధికారి వద్దకు పంపాలన్నారు. ఆ తరువాత ఆ గుమస్తా పర్సనల్ ఫైలు నియమిత కాలిక నివేదికలు ఫైలు రూపంలో ఉంటుందన్నారు. జనరల్ సబార్డినేట్ సభ్యుల పర్సనల్ ఫైలు ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ సర్వీసుకు అనుసరించు పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. అప్పర్ డివిజన్ ప్రమోషన్‌కు అర్హులుగా భావించిన లోయర్ డివిజన్ గుమస్తాలతో సహా సబార్డినేట్ సర్వీసులోని ఇతర అధికారులందరికి సంబంధించిన పర్సనల్ ఫైళ్ళు నియమిత కాలిక నివేదికల మాదిగానే ఉంటుందన్నారు. రహస్య నివేదిక నమూనాను ఎప్పుడూ మడవకూడదన్నారు. అధికారుల పేర్లు, హోదాను పూర్తిగాను, సివిల్ లిస్టులో లేక సర్వీసు పుస్తకంలో సూచించిన రీతిగా, యథాతథంగాను పేర్కొనాలన్నారు. ఎవరేని అధికారి సంవత్సరం, లేక అర్ధ సంవత్సరంలో బదిలీ అయితే సంవత్సరం/అర్ధ సంవత్సరంలోని మొదటి భాగంలో ఆయన ఏ అధికారి కింద పనిచేశారో ఆ అధికారిచే నివేదిక తయారు చేయబడి, ఏ అధికారి కింద పనిచేసేందుకు బదిలీ చేయబడునో ఆ అధికారికి పంపాలని తెలిపారు. ఒక ఉద్యోగి ఇచ్చిన సెన్సర్ రహస్య నివేదికలో నమోదు చేయకూడదన్నారు. అయితే సెన్సర్ ను తెలియజేయు ఆ లేఖ యొక్క ప్రతి ఒకటి అధికారి రహస్య పత్రాలకు జత చేయబడునని వీరయ్య తెలిపారు. .

దాతల తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

● ప్రవాసాంధ్రుడు నూతక్కి రామకృష్ణ ప్రసాదు

● నూతన భవన నిర్మాణానికి రూ.25లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు అందజేస్తున్న ఆర్థిక తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని ప్రవాసాంధ్రుడు నూతక్కి రామకృష్ణ ప్రసాదు సూచించారు. కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో విద్యార్థులతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన భవన నిర్మాణానికి రూ.25లక్షల విరాళాన్ని కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఆయన అందజేశారు. అనంతరం నూతక్కి రామకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ భవన నిర్మాణంలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. మిగిలిన విరాళాన్ని త్వరలోనే అందజేస్తానని తెలిపారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి గతంలో రూ.25 కోట్ల విరాళాన్ని నూతక్కి రామకృష్ణ ప్రసాదు ప్రకటించారని, ఇప్పటి వరకు రూ.10 కోట్ల సాయాన్ని అందజేశారని వివ రించారు. కాకతీయ సేవ ట్రస్ట్ అధ్యక్షుడు గూడూరు సత్యనారాయణ మాటా ్లడుతూ గుంటూరు వసతి గృహాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో 12 ప్రదేశాల్లో హస్టల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మరో ఎన్నారై కానూరి శేషుబాబు మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ గాకుండా ఇతర రంగాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, వడ్లమూడి నాగేంద్రం. గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, మద్రిపూడి సీతారామయ్య, ఘంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, విజయవాడ కమ్మ సంఘ సభ్యులు నన్నపనేని నాగేశ్వరరావు, గుమ్మడి రామకృష్ణ, కేజేసీ సభ్యులు యర్రా నాగేశ్వరరావు, కొత్తపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సామినేనికోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న నూతక్కి రామకృష్ణప్రసాదు

పేద విద్యార్థులకు విద్యా పరంగా అండ

● మేక్ ఏ డిఫరెన్స్ సంస్థ గుంటూరు హెడ్ రవికిరణ్

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): షెల్టర్ హోమ్స్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువ ుకొంటున్న పేద విద్యార్థులకు విద్యపరంగా అండగా నిలుస్తున్నామని మేక్ ఏ డిఫరెన్స్ (ఎంఏడీ) స్వచ్ఛంద సంస్థ గుంటూరు హెడ్ రవికిరణ్ అన్నారు. సంస్థ ఏర్పాటు చేసి పద్దెనిమిదేళ్లు అవుతున్న సందర్భంగా బుధవారం ఫినిక్స్ మాల్‌లో వలంటీర్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.తమ సంస్థలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇంజనీరింగ్, వైద్య, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఇప్పటికే చదువు పూర్తి చేసుకొని ఉద్యోగాలు చేస్తున్న వారు ఉన్నారని రవికిరణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికిరణ్

ఎన్జీరంగా.. రైతు బాంధవుడు



నేడు 124వ జయంత్యుత్సవాలు

స్వాతంత్ర్య సమరయోధుడిగా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, రైతు ఉద్యమ నేతగా పేరుగాంచారు ఆచార్య ఎన్జీరంగా. ఆయన పూర్తి పేరు గోగినేని రంగనాయకులు. ఆయన పోరాటయోధుడిగానే కాకుండా సాహిత్య వేత్తగా గుర్తింపు పొందారు. సుదీర్ఘకాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసి, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డులు అందుకున్నారు. గాంధీజీని అనుసరించిన ఆయన కాంగ్రెస్‌తో విబేధించి స్వతంత్ర పార్టీ, కృషికార్ లోక్ పార్టీలను స్థాపించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన సందర్భాలూ ఉన్నాయి. రైతుల సంక్షేమం కోసం అనుక్షణం పోరాడిన ఎన్జీరంగా, రాజకీయాలోకి రైతులను తీసుకురావాలని నిడుబ్రోలులో రామానీయుడు రాజకీయ పాఠశాలను స్థాపించి తదనంతర కాలంలో పూర్తిస్థాయి రాజకీయ పాఠశాలగా రూపొందించారు. ఆయన 124వ జయంత్సోవాలను నవంబరు 7వ తేదిన ఘనంగా నిర్వహించేందుకు పొన్నూరు, గుంటూరులోని లాం, ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.


పొన్నూరుటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్జీరంగా గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో నవంబరు 7, 1900 సంవత్సరంలో గోగినేని అచ్చమాంబ, నాగయ్య దంపతులకు జన్మించారు. నిడుబ్రోలులోని ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న ఆయన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల నుంచి పట్టభద్రులయ్యారు. 1926లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రం అభ్యసించారు. తిరిగి భారతదేశానికి వచ్చి మద్రాసులోని పచ్చియప్ప కళాశాలలో ఆర్థికశాస్త్ర ఆచార్యులుగా 1930 వరకు పనిచేసారు. 1924లో మాచవరం గ్రామానికి చెందిన భారతీదేవిని వివాహం చేసుకున్నారు. ఆచార్యులుగా పనిచేసే సమయంలో మహాత్మాగాంధీ పిలుపు మేరకు ఉద్యమన్ని వదిలి స్వాతంత్ర్య ఉద్యమ సమరంలో అడుగు పెట్టారు.

ఎన్జీరంగా రచనలు

ఆచార్య ఎన్జీరంగా ఆంగ్లబాషలో 65 పుస్తకాలు, తెలుగులో 15 పుస్తకాలను రాసారు. రైతు కూలీల కోసం, ప్రత్యేక ఉద్యమాన్ని రూపొందించి మహాత్మగాంధీతో జరిగిన చర్చల సారాంశాని బాపు ఆశీస్సులు పేరుతో పుస్తకం రచించారు. నేలగిరి కొండజాతులు, ఆధునిక రాజ్యాంగ సంస్థలు, కాకతీయ నాయకులు, కిసాన్ అండ్ కమ్యూనిటీస్, చాలెంజ్ ఆఫ్ ద వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్, రైతు భజనావళీ, ప్రపంచ ధనిక వాదం, ధన్యజీవి నేతాజీ, శారదార్పన, భారతీదేవి స్మృతులు, విప్లవ రైతాంగం, ఫైట్ ఫర్ ఫ్రీడమ్, పీజెంట్స్ అండ్ కోఆపరేటీవ్ ఫార్మింగ్, ఎకనామిక్ ఆరనైజేషన్ ఆఫ్ ఇండియన్ విలేజెస్, ది ఎకనామిక్స్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ వంటి రచనలే కాకుండా ఆర్థిక శాస్త్రంలో పలు పరిశోధన గ్రంథాలను రచించారు.

ఉద్యమ నేపథ్యంలో.....

గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగు పెట్టిన ఎన్జీరంగా తదనంతర కాలంలో రైతులలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి రైతు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉద్యమంలో రైతులను భాగస్వాములను చేసి ఉద్యమాలను పతాకాస్థాయికి తీసుకెళ్ళారు. అదే సమయంలో 1931 డిసెంబర్‌లో అరెస్టు అయి ఏడాది కాలం జైలు శిక్ష అనుభవించారు. 1933 సంవత్సరంలో మహాత్మాగాంధీజి చేతుల మీదుగా నిడుబ్రోలులో రామానీయుడు వయోజన రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. 1940లో మద్రాసులో శాసన ఉల్లంఘన ఉద్యమం చేసి జైలుకు వెళ్లారు. 1941లో జైలు నుంచి విడుదలైన రంగాను తిరిగి రాయవెల్లూరు జైలుకు పంపి 1942లో విడుదల చేసారు. తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనందుకు 1942 నవంబరున రంగాను నిర్బంధించిన ఆంగ్లేయులు రాజపుట్లానా వద్ద ఉన్న దామో జైలులో ఉంచి 1944లో విడుదల చేసారు. జైలులో ఉన్న కాలంలో ఎన్జీరంగా సాహిత్యంపై మక్కువతో అనేక రచనలు చేసారు. మొత్తం 6 ఏళ్ల జైలు జీవితం గడిపారు.



మహాత్మాగాంధీతో ఆచార్య ఎన్జీరంగా

ఎందరికో రాజకీయ ఓనమాలు....

నిడుబ్రోలులో ఏర్పాటు చేసిన రామానీడు రాజకీయ పాఠశాల ద్వారా దేశవ్యాప్తంగా ఎంతో మంది రైతులను, సామాన్యులను ఉత్తమ రాజకీయ వేత్తలుగా తీర్చిదిద్దారు. మహాత్మగాంధీజి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పాఠశాలకు దేశం నలుమూల నుంచి ఉత్తములను ఎంపిక చేసి పాఠశాల్లో రాజకీయ ఓనమాలు దిద్దించారు. ప్రారంభంలో రాజకీయ ఆర్థిక, కార్మిక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలో శిక్షణ ఇచ్చారు. అయితే ఈ పాఠశాలను కాలక్రమంలో రాజకీయ పాఠశాలగా రూపాంతరం చెందించారు. ఈ పాఠశాల దేశానికి ఎంతో మంది ముఖ్యమంత్రులను, మంత్రులను అందించింది. ఆచార్యా ఎన్జీరంగా శిషులుగా గుర్తింపు పొందిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, కొణిజేటి రోశయ్య. ఆర్ ఎం సింగ్ దేవ్ (ఒరిస్సా), చిమన్‌భాయ్ పటేల్ (గుజరాత్), అన్నాదురై (తమిళనాడు), దామోదరం సంజీవయ్య, బెజవాడగోపాళరెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి తదితరులు ఈ పాఠశాల్లో రాజకీయ పాఠాలు నేర్చుకున్నవారే అంతే కాకుండా సర్దార్ గౌతు లచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, రాజగోపాల్ నాయుడు, వీరాచారి, జీయర్ దాస్, అనగాని భగవంతరావు, యడ్లపాటి వెంకట్రావు, గోవాడ పరంధామయ్య, ఔతు రామిరెడ్డి తదితరులు మత్రులుగా పనిచేసారు. ఈ పాఠశాలో విద్యను అభ్యసించిన ఎందరో దేశంలో పలు రాష్ట్రాలో పార్లమెంట్ సభ్యులుగాను ఎంపికైయ్యారు. నేటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సైతం ఆచార్య ఎన్జీరంగా శిష్యులుగా గుర్తింపు పొందారు.



అనేక రంగాల్లో గుర్తింపు పొందిన ఆచార్య ఎన్జీరంగా 124వ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గుంటూరులోని లాం, ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో నేడు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చన్నయుడు, అనగాని సత్యప్రసాద్‌లు హాజరు కానున్నారు. అంతే కాకుండా జిల్లాలోని ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, బూర్ల రామాంజనేయులు. రైతు సంఘం నాయకులు యలమంచలి శివాజి, వడ్డే శోభనాదీశ్వరరావు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు హాజరు కానున్నారు.

రాజకీయ అరంగేట్రం

1936లో భారతీయ కాంగ్రెస్ లక్నో సమావేశం సందర్భంగా ఎన్జీరంగా అఖిల భారత కిసాన్ సభ స్థాపించి మొదటి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దీని ద్వారా జమిందారీ వ్యవస్థ రద్దు చేయాలని గ్రామీణ రుణాలను రద్దు చేయాలని పోరాటం జరిపారు. 1946లో రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా ఎన్నికైయ్యారు. 1952లో తాత్కాలిక పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైయ్యారు. అయితే 1951లో కాంగ్రెస్ పార్టీ నుంచి వేరుపడి కృషి కార్ లోక్‌పార్టీని స్థాపించారు. 1955లో కాంగ్రెస్, ప్రజా పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికలో విజయం సాధించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కోరిక మేరకు కృషి కార్ లోక్‌పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసారు. 1957లో తెనాలి నుంచి లోక్ సభకు ఎన్నికైయారు. అయితే నెహ్రూ విధానాలను వ్యతిరేకిస్తూ తిరిగి కాంగ్రెస్ పార్టీని వీడారు. తదనంతర కాలంలో స్వతంత్ర పార్టీని స్థాపించారు. 1962లో జరిగిన సార్వత్రిక ఎన్నికలో 25 స్థానాలను గెలుపొంది బలమైన ప్రతిపక్షంగా స్వతంత్ర పార్టీని నిలిపారు. 1972లో ఇందిరా గాంధీ నేత్రత్వంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1991 వరకు సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా పనిచేసి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును అందుకున్నారు. మొత్తం 60 ఏళ్లపాటు ఉభయ పార్లమెంట్ సభ్యులగా పనిచేసి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా..





తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా గురజాలకు చెందిన జంగా కృష్ణమూర్తి, మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవి గురువారం తిరుమలలో ప్రమాణ స్వీకారం చేశారు.

జాతీయ స్థాయి తైక్వాండోకు విజ్ఞాన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య),నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని వీసీ ఆచార్య పీ నాగభూషణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు సామ్యూల్‌చార్లీ, డీ హర్షిత్, వీ నిఖిల, ఎండీ కరిష్మ, ఎంఎం ఆపంటే తదితరులు జాతీయ స్థాయిలో త్వరలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు అభినందించారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల

◆ ఈ నెల 9న ప్రవేశ పరీక్ష..

◆ రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. గురువారం వరకు అపరాధ రుసుము లేకుండా ప్రవేశ పరీక్ష ఫీజు రూ.500 చెల్లించవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేయని అభ్యర్థులు నేరుగా టెన్త్ క్లాస్, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా అభ్యర్థి ఫొటోతోపాటు రూ.1500 తత్కాల్ ఫీజు చెల్లించి, పరీక్ష జరిగే 9వ తేదీన నేరుగా హాజరు కావచ్చన్నారు. సంబంధిత ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈ నెల 10న సాయంత్రం విడుదల చేస్తామని చెప్పారు.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి)

వృత్తి విద్యాకళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సులో శిక్షణ ఇచ్చి ఎంసెట్, జేఈఈ , నీట్ పరీక్షలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటిరియల్, పుస్తకాలు ఎన్‌సీఆర్‌టీ నుంచి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు.

ఆర్థిక ఇబ్బందులతో శిక్షణకు దూరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద,బడుగు బలహీనవర్గాల విద్యార్థులే. వారికి పది స్థాయిలో మంచి మార్కులు వచ్చినా కార్పొరేట్/ప్రైవేటు కళాశాలల్లో చదివే స్తోమత లేక ప్రభుత్వ కళాశాల్ని ఆశ్రయిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో కూడా మంచి మార్కులు సాధిస్తున్నా జాతీయ స్థాయి శిక్షణ తీసుకోలేక పోతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తరువాత ఎంసెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ , నీట్ కోసం రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు ఫాస్ట్‌ట్రాక్ శిక్షణ కోసం వెచ్చించాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించలేక పేద విద్యార్థులు ఇటువంటి శిక్షణకు దూరమౌతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఇచ్చే శిక్షణ వారికి ఎంతో ఉపయోగ పడనుంది.

పోటీ పరీక్షలకు ఎంపిక ఇలా...

ఇంటర్ చదివే విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ శిక్షణ కోసం ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష నిర్వహించి విద్యార్ధిని విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ నారాయణ కళాశాల సహకారంతో శిక్షణ ఇవ్వనున్నారు. ఆ కళాశాలలు రూపొందించి మెటీరియల్‌తో పాటు అనేక మాక్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలల్లోనే దశల వారీగా శిక్షణ ఇచ్చి



పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఇదిలా ఉంటే జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థుల్ని సిద్ధం చేసేందుకు అవసరమైన విధి విధానాలు ఇంకా రాలేదని, సంక్రాంతి సెలవుల తరువాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో దందా

- వీరి అనుమతి లేకుండా లారీలకు సరుకు లోడింగ్ చేయకూడదంట
- చేస్తే అడ్డుకొని తీరుతామని బెదిరింపులు
- తాజాగా నాలుగు లారీల టైర్లు గాలి తీసేసి అడ్డగింత

గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో కొంతమంది లారీ యజమానులు ఒక మాఫియాగా ఏర్పడి దందా కొనసాగిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి ఎగుమతి చేయడానికి వీళ్లు నిర్ణయించిన లారీలలోనే రవాణా చేయాలని హుకూం జారీ చేస్తున్నారు. వీళ్లని కాదని ఎవరైనా లారీలు పెడితే వాటిని అడ్డుకొని దాడికి తెగబడుతున్నారు. లారీ టైర్లలో గాలి తీసేసి అడ్డగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల అండ దండలతో యథేచ్ఛగా దందా కొనసాగించారు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత అధికార పార్టీ నేత ఒకరితో ఒప్పందం చేసుకొని తిరిగి దందా కొనసాగిస్తున్నారు. తాజాగా బుధవారం సాయంత్రం చిలకలూరిపేట రోడ్డులోని వేబ్రిడ్జి వద్ద ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి లోడింగ్ చేసిన నాలుగు లారీలను అడ్డుకుని దౌర్జన్యానికి దిగారు.

మిర్చియార్డు నుంచి ఎక్కువ సరుకు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి జరుగుతుంటుంది. అక్కడి నుంచి ఆసియా ఖండంలోని కొన్ని దేశాలకు ఎక్స్‌పోర్టు అవుతుంది. దీంతో నిత్యం పశ్చిమ బెంగాల్‌కు మిర్చి లోడింగ్‌లు జరుగుతుంటాయి. ఇదే అదనుగా కొంతమంది పలుకుబడి కలిగిన లారీ యజమానులు నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్‌ని ఏర్పాటు చేసి సిండికేట్‌గా మారారు. ఒక్కో లారీకి రూ. 1.50 లక్షల కిరాయిని వీళ్లు నిర్ణయించారు. లారీ యజమానులంతా తమ అసోసియేషన్‌లో పేరు రిజిష్టర్ చేసుకొంటే లారీలకు సీరియల్ పెడతామని చెబుతున్నారు. తమ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ లారీ పెడతానికి వీల్లేదని హుకూం జారీ చేశారు. అసోసియేషన్‌లో సీరియల్‌కు లారీని పెడితే నెలకు ఒకటి/రెండు ట్రిప్పులకంటే ఎక్కువ పడే పరిస్థితి లేదు. మరోవైపు అసోసియేషన్ నేతలు మాత్రం వాళ్ల లారీలకు ఎలాంటి సీరియల్ లేకుండా కిరాయికి పెట్టేసి రూ. లక్షలు పోగేసుకొంటున్నారు.



చిలకలూరిపేట రోడ్డులో మిర్చి లారీ యజమానుల మాఫియా అడ్డగించిన మిర్చి లారీ

ఈ వివాదం గత కొన్ని నెలల నుంచి కొనసాగుతూనే ఉన్నది. పోలీసుస్టేషన్‌కు వెళ్లినా వివాదం పరిష్కారం కాలేదు. దీంతో మళ్లీ లారీ ఓనర్స్ మాఫియా బుధవారం రెచ్చి పోయింది. అసోసియేషన్ పేరుతో ఉన్న కారులో వచ్చి ఎక్స్‌పోర్టుకు పెట్టిన లారీ యజమానిపై దౌర్జన్యానికి దిగారు. అదేమని ప్రశ్నించినందుకు లారీ టైర్లలో గాలి తీసేశారు. దీనిపై జిల్లా యంత్రాంగం, పోలీసులు స్పందించి కఠిన చర్యలు చేపట్టకపోతే శాంతిభద్రతల సమస్యకు దారి తీసే అవకాశం ఉన్నది.

ముందస్తు పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ

- పెరుగుతున్న కేసులు
- జిల్లాలో కేన్సర్ స్ర్కీనింగ్‌కు రంగం సిద్ధం
- నేడు జాతీయ కేన్సర్ డే

- కొన్ని పెద్ద ఉల్లిపాయలు వలవగానే పైపొరలో లేత పసుపు రంగులో ఫంగస్ మచ్చలు కనిపిస్తాయి. వీటిని చాల మంది పట్టించుకోరు. అదే ఉల్లిపాయలను కూరల్లో వాడుతుంటారు. కేన్సర్ వ్యాధులను కలిగించడంలో ఈ పంగస్ మచ్చలు ఉన్న ఉల్లిపాయాలు అగ్రస్థానంలో ఉంటాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.
- వంట చేసేటప్పుడు మిగిలిపోయిన నూనెలను దాచి మరోసారి వాడుతుంటారు. ఇలా ఒకటి, రెండు సార్లు వినియోగించగా మిగిలిపోయిన నూనెను వంటల్లో వాడటం ఆరోగ్యరీత్యా ప్రమాదకరం. తాలింపు సమయంలో ఈ నూనెల నుంచి వెలువడే ఘాటైన వాయువులు (ఫ్యూమ్స్) ఊపిరితిత్తుల కేన్సర్‌కు కారణమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.
- నిత్యజీవితంలో చాలా మంది ప్లాస్టిక్ కవర్లలో వేడిగా ఉంటే ఆహార పదార్థాలు, టీలు, కాఫీలు తెచ్చుకొని తాగుతుంటారు. ఇది ఆరోగ్యరీత్యా మంచిది కాదు. ఆహార పదార్థాల్లో ప్లాస్టిక్ కవర్లకు ఎంతో దూరంగా ఉంటే కేన్సర్‌ను అంత దూరంగా ఉంచినట్లేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

గుంటూరు మెడికల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో నానాటికి పెరుగుతున్న కేన్సర్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఏటా నవంబర్ ఏడవ తేదీన జాతీయ కేన్సర్ అవగాహన రోజుగా నిర్వహిస్తున్నారు. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2014 నుంచి దీనిని నిర్వహిస్తున్నారు. పలు రకాల కేన్సర్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నివారణ, చికిత్సల పట్ల అవగాహన కల్పించడమే ఈ రోజు ఉద్దేశం. ఏటా దేశంలో కొత్తగా 7 లక్షల కేన్సర్ కేసులు నమోదౌతున్నాయి. వీరిలో మూడు వంతుల రెండు వంతుల కేసులు వ్యాధి ముదిరిన దశలో వస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. పురుషుల్లో నోటి కేన్సర్, ఊపిరితిత్తులు, ఉదర కేన్సర్‌లు ఎక్కువగా కనిపిస్తుంటే, మహిళల్లో రొమ్ము కేన్సర్లు, గర్భాశయ ముఖద్వార, గర్భాయ, అండాశయ కేన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. బాధితుల్లో 60 శాతం మంది 35 నుంచి 65 ఏళ్ల వారే. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులు కేన్సర్‌కు కారణమౌతున్నాయి.

జిల్లాలో కేన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాన్ కమ్యూని కబుల్ డిసీజెస్ విభాగం పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా నవంబరు నెల నుంచి కేన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమం ప్రారంభించనున్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి ఆరోగ్య సమాచారం సేకరించనున్నారు. దీనికి సంబంధించి ప్రశ్నాపత్రాలను కూడా ప్రభుత్వం జిల్లాకు సరఫరా చేసింది. నోటి కేనస్ర్ రోగులను గుర్తించేందుకు పలు ప్రశ్నలను సంధిస్తారు. 'మీరు మసాలతో కూడిన ఘాటు ఆహార పదార్థాలు తినడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? నోటిలో తెల్లని/ఎర్రని మచ్చలు ఉన్నాయా? మానని పుండ్లు ఉన్నాయా? నోరు తెరవడంలో ఇబ్బందులు ఉన్నాయా? అనే పలు రకాల ప్రశ్నలను సంధించి వాటి సమాధానాలు రాబడతారు.

కేన్సర్ నివారణ ఇలా...

దైనందిత జీవితంలో ఆరోగ్యకరరమైన జీవనశైలి అవలంభిస్తే పలు రకాల కేన్సర్‌లను నుంచి రక్షణ లభిస్తుంది. పొగాకు ఉత్పత్తులకు పూర్తి దూరంగా ఉండాలి. మద్యపానం అలవాటు ఉన్న వారు దానిని మానుకోవాలి. ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలు అధికంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజూ 30 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేయాలి. రేడియేషన్‌కు, అతి నీలలోహిత కిరణాలు శరీరం మీద పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. కుటుంబంలో ఎవరైనా కేన్సర్‌తో మరణించిన చరిత్ర ఉంటే సంబంధిత కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం.

బ్రెస్ట్ కేన్సర్ స్ర్కీనింగ్

మహిళల్లో రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్‌లను తొలి దశలో గుర్తించేందుకు సర్వేలో కొన్ని ప్రశ్నావళిని చేర్చారు. బ్రెస్ట్ కేన్సర్ స్ర్కీనింగ్ సర్వేలో..రొమ్ములో గడ్డలు ఉన్నాయా? నిప్పిల్స్ నుంచి ద్రవాలు కారుతున్నాయా? రొమ్ము ఆకారంలో మార్పు వచ్చిందా? రుతుక్రమంలో కాకుండా ఇతర సమయాల్లో కూడా రక్తస్రావం జరుగుతుందా? వంటి ప్రశ్నలను వేస్తారు. ఇదేరీతిలో గర్భాశయ కేన్సర్, ఇతర కేన్సర్‌లకు సంబంధించిన ప్రశ్నావళిని కూడా సిబ్బందికి అందజేశారు. వాస్తవానికి ఈ సర్వేలో కేవలం కేన్సర్ వ్యాధుల స్ర్కీనింగ్ నే కాకుండా వ్యక్తిగత అలవాట్లు, ఆరోగ్య పూర్తి వివరాలు, దైనందిత జీవనం, సాధారణ కుటుంబ వివరాలను కూడా సేకరిస్తారు. ఈ నెలాఖరు లోపు జిల్లాలో కేన్సర్ సర్వేను ప్రారంభించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సన్నాహాలు చేస్తోంది.



స్ర్కీనింగ్ పరీక్షలతో కేన్సర్‌పై విజయం



● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

కేన్సర్‌పై విజయం స్ర్కీనింగ్ పరీక్షలతోనే సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. ముందస్తు స్ర్కీనింగ్ పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ లభిస్తుందని ఆమె వివరించారు. హైరిస్క్‌లో ఉన్న వారు కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. గురువారం ఉదయం పది గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అన్ని ప్రాంతాల్లో కేన్సర్ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని డాక్టర్ విజయలక్ష్మీ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ర్యాలీలు జరపాలని ఆమె తెలిపారు. ఈ ర్యాలీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

రేపటి నుంచి జీవన సిరిపై అవగాహన

వట్టిచెరుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లభగుంట గ్రామ సమీపంలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక సేవాకేంద్రం సహకారంతో ఈనెల 8, 9, 10 తేదీల్లో చిరు ధాన్యాలతో జీవన సిరిపై ఆరోగ్యం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. దీనికి నరక ఖాదర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు వెల్లడించారు.

పొగాకు సాగుకు రైతులు మొగ్గు

● గతేడాది గిట్టుబాటు ధరతో పొగాకు బాట
● సాగుకు లక్షలు ఖర్చవుతున్నా వెనుకాడని తీరు
● కనుమరుగైన పత్తి, మిరప పంటలు

పెదనందిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో రైతులు అనేక మంది మిరప పంటకు ప్రత్యామ్నాయంగా పొగాకు పంట వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగనుంది. గతేడాది పొగాకు పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పండిన పంటను కొనుగోలు చేసేందుకు అనేక కంపెనీలు ముందుకు రావడం, ఆశించిన మేర దిగుబడితో పాటు గిట్టుబాటు ధర కలగడంతో పొగాకు సాగుకు గిరాకీ పెరిగింది. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో అధిక వర్షాలు, బీడీపీలతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతినడంతో కొంతమంది రైతులు అప్పులు, మరి కొంత మంది పొగాకు పంటలు సాగుచేశారు. అప్పరాలకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఈ ఏడాది మిర్చి రైతులతో పాటు అపరాల సాగు రైతులు కూడా పొగాకు పంటలను సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. రైతులు గతంలో


నారుమళ్ళు సాగు చేస్తున్న రైతులు

పొగాకు నారు అధిక ధర పలకడంతో ఈ ఏడాది ముందస్తుగా మేల్కొని రైతులు వారి సొంత పొలాల్లోనే నారుమళ్ళు పోసి సిద్ధం చేసుకుంటున్నారు. పొగాకు పంటకు కూలీల కొరత ఉన్నప్పటికీ, పెట్టుబడులకు సైతం వెనుకాడకుండా రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. రెండు నెలలుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో నాటిన పైర్లు కుళ్లిపోయినప్పటికీ మరల నారు తెచ్చి నాట్లు వేస్తున్నారు. మండలంలో గత

ఏడాది 2,208 ఎకరాలు పొగాకు పంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఖరీఫ్‌లో 300 ఎకరాలు పొగాకు సాగు చేశారు. రబీలో 3,500 ఎకరాలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నట్లు అధికారులు అంచనా.


ఖరీఫ్‌లో సాగు చేసిన పొగాకు పైరు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి

పెదనందిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో నిర్ణీత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ ఎం ఉమాదేవి అన్నారు. మండలపరిధిలోని వరగాని, పెదనందిపాడు ప్రాథమిక పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు తనిఖీ చేసి, విద్యార్థుల హాజరు శాతం ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. త వ్వనిసరిగా మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు న్యూట్రీషన్‌తో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో సీహెచ్ విజయ నిర్మల, సీడీపీవో సుజాతాదేవిలు ఉన్నారు.

అపరాల సాగుతో భూసారం పెరుగుదల


గొడవర్రులో రైతులతో మాట్లాడుతున్న నీతిఆయోగ్ అధికారులు

దుగ్గిరాల(ఆంధ్రజ్యోతి), నవంబరు 6: అపరాల సాగుతో భూసారం పెరుగుతుందని, నీతిఆయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారి ఎం. అనూరాధ అన్నారు. గొడవర్రులో రైతులతో అధికారులు బుధవారం సమావేశమయ్యారు. అపరాల సాగు విస్తీర్ణం పెంచుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. అవసరమైన మేరకే పురుగుమందులు వాడాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి వచ్చిన ఎస్ అనూరాధ, ఏవో శిరీష, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు

● ఎంపీడీవో యుగంధర్

కాకుమాను, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు పంట ఉత్పత్తులను రక్షించుకునేందుకు పురుగు మందులు పిచికారి చేసే తైవాన్ స్ప్రేయర్లను, టార్పాలిన్ పట్టలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందని ఎంపీడీవో యుగంధర్ అన్నారు. అప్పాపురం, రేటూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగింది. వరి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. అనంతరం రైతులతో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఏవో కిరణ్మయి మాట్లాడుతూ జీవ శిలీంద్ర నాశిని సూడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి వాడకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో జూనియర్ పెట్టుబడి అధికారి వెంకట సాంబశివరావు, అగ్రి, వీఏఏలు మహేంద్ర నాయక్, అప్పారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చర్మకారులు, డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ చర్మకార సేవాసంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు కోరారు. ఈ మేరకు రాష్ట్రంలో రెండు విడతలుగా 16 జిల్లాల్లో పర్యటించి కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి వినతిపత్రాలను అందజేశామన్నారు. రాష్ట్రంలో చర్మకారులు, డప్పు కళాకారులు, చర్మపు కార్మికులు, కబేళా వృత్తిదారులకు ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష చొప్పున రుణాలు మంజూరు చేయాలని, లిడ్ క్యాప్‌కు రూ.300 కోట్లు కేటాయించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రతి జిల్లాలో లెదర్ పార్కుల నిర్మాణం చేపట్టాలని, మండల కేంద్రాల్లో చెప్పుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరపాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి : ఎంపీడీవో

పెదనందిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు మాట్లాడి నెలల్లో జరిగిన అభివృద్ధి పనుల నివేదికలను సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ హెప్సీబా, ఉప ఎంపీపీ సాంబశివరావు, ఎంపీటీసీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభలో 35 దరఖాస్తులు

పెదనందిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో తలెత్తిన భూసమస్య పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తారని, ఈ సభలను రైతులు ప్రజలు సద్వినియోగించుకోవాలని డీటీ కరీముల్లా తెలిపారు. భూసంబంధిత సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లయితే వాటిని పరిష్కరిస్తామని, భూసమస్యలపై పాలపర్రులో 35 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

87 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 87 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాలుకు కనిష్ఠ ధర రూ.9,451, గరిష్ఠ ధర రూ.10,600, మోడల్‌ధర రూ.9,451 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.10,600, గరిష్ఠధర రూ.9,451 మోడల్‌ధర రూ.12,000 పలికాయి.

23 నుంచి శాప్ ఎస్‌డీ కోర్సులో శిక్షణ

తాడేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): 23 నుంచి శాప్ ఎస్‌డీ ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సులో శిక్షణ నిర్వహిస్తామని మానవ సేవాసంస్థ అధ్యక్షుడు, నిర్వాహకుడు వంగల సురేష్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి

● గ్రామాల్లో పర్యటించి సమస్యలు గుర్తించాలి
● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

పెదనందిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు పనితీరు మార్చుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులను సమావేశంపై సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి ఏర్పాట్లు చేయకుండా మొక్కుబడిగా కొద్దిపాటి గదిలో సమావేశం ఏర్పాటు చేయడంపై అధికారులపై మండిపడ్డారు. గ్రామాల్లో అధికారులు పర్యటించి సమస్యలు గుర్తించి వాటిపై అధ్యయనం చేసి పరిష్కార దిశగా కృషి చేయాలని, నిధులతో కూడిన పనులు చేపట్టవలసి ఉంటే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లో అనేక అభివృద్ధి, సంక్షేమం అంటూ కాలం వెళ్లబుచ్చిందని, దీనికి అధికారులు కూడా అలానే ఉండేవారని, కానీ కూటమి ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని, అధికారులు అలసత్వం వీడి ప్రజాసమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. మండలంలోని పెదనందిపాడు, తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరిస్తామన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ ప్రాంత సమ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

స్యలపై చర్చిస్తానన్నారు. పెదనందిపాడులో ఎకనామిక్ హబ్ ఏర్పాటుపై చర్చ జరిపి నిధుల మంజూరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. మండలంలో ఏపీడీఏ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా మండలశాఖ అధికారులు జరిగిన, జరుగుతోన్న పనుల నివేదికలను వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, తహసీల్దార్ శంకరరావు, ఎస్ఐ మధువనన్, మాజీ మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు మానిపాటి శౌరయ్య, పొట్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, నాయకులు మోపర్తి చెంచయ్య, నల్లూరి అంకమ్మచౌదరి, పోతూరి వెంకటప్పయ్య, వివిధశాఖల సిబ్బంది, టీడీపీ బీసీ సెల్ ఏంజెల్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్, గ్రామ అధ్యక్షుడు శివరామకృష్ణయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు రావెల విద్యార్థినులు

తాడికొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీలకు రావెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగమణి తెలిపారు. బుధవారం పాఠశాలలో జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థినులు, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని మాట్లాడుతూ నెల్లూరి జిల్లా దర్శిపల్లిలో నవంబరు 2, 3 తేదీల్లో అండర్-17 రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో గుంటూరు జిల్లా టీమ్ తరఫున రావెల విద్యార్థినులు పాల్గొన్నారని తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానంలో గుంటూరు జిల్లా జట్టు విజయం సాధించి రన్నర్ బహుమతి కైవసం చేసుకుందని తెలిపారు. జిల్లా జట్టు తరఫున ఐదుగురు పాల్గొనగా వారిలో నలుగురు రావెల జడ్పీ పాఠశాల నుంచి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేరుబోయిన భార్గవి రెండో స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీ


యోగా పోటీల్లో పతకాలు గెలుపొందిన విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

లకు ఎంపికయ్యారని తెలిపారు. బొంత అనూష స్టాండ్ బై గా ఎంపికైనట్లు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి జట్టులో ఏ పూజిత, ఎం అక్షయ పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రేష్మ, పీఈటీ జగదీశ్వరరెడ్డి, ద్వితీయ హెచ్ఎం పరకాయలపాటి రవిబాబు, చెరుకూరి శ్రీనివాసరావు, ఓ శివకుమార్, అన్నవరపు రాజేష్, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి నెలాఖరులోగా నిర్మాణం పూర్తిచేసే వారికే సహకారం

● గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్


చిలువూరులో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్, ఎంపీడీవో జబీన్ తదితరులు

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), నవంబరు 6: దుగ్గిరాల, చిలువూరు గ్రామాల పరిధిలోని నివేశన స్థలాల లేఅవుట్లను గృహ నిర్మాణసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జేవీపీ ఆర్ కేవీ ప్రసాద్ బుధవారం సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు ప్రారంభించిన గృహాలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని అన్నారు. గృహ నిర్మాణం కోసం ఎస్‌హెచ్‌జీ రుణ సదుపాయం అందిస్తామన్నారు. మరింత వేగం చేస్తున్నామన్నారు. ఐదువాలంలో నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల యూనిట్ ఖరీదు పెరిగే అవకాశం లేదన్నారు. మార్చి నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న ఎడల భవిష్యత్తులో వారికి ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం అందదని తేల్చి చెప్పారు. పైకప్పు దశలో నిర్మాణం నిలిచిపోయిన లబ్ధిదారులతో మాట్లాడి, ఎస్‌హెచ్‌జీ రుణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో జబీన్‌తో కలిసి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, సాదిక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో యానిమేటర్లు, క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు వివేకానంద, శరత్, గృహనిర్మాణశాఖ ఏఈ జీవీ. సుబ్బారావు, ఏపీఎం కోటేశ్వరరావు, ఏపీవోలు మధులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

● ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా


మంగళగిరి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా తెలిపారు. నగరంలో ఇంటింటికీ చెత్త సేకరణ పనులను బుధవారం ఉదయం ఆయన పర్యవేక్షించారు. కొత్త పేట, టిప్పర్ల బజారు ప్రాంతాల్లో ఆర్ఎఫ్ఐడీ స్కానర్లు పనిచేస్తున్నాయా లేదో ఆయన పరిశీలించారు. అనంతరం ప్రజలతో మాట్లాడి ప్రతిరోజు చెత్త సేకరణకు సిబ్బంది వస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎంటీఎంసీ కార్యాలయంలో


స్కానర్ పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్ బాషా

ప్రత్యేకంగా కాల్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే కాల్ సెంటర్ 70939 12653, 08645-295192 నెంబర్లకు ఫోను చేసి సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రతిరోజు వీధులు, పైడు కాలువలను శుభ్రం చేయాలని సిబ్బందిని సూచించారు.

ఎరువుల కొరత, అధిక ధరలను నియంత్రించాలి

● రైతు సంఘ నాయకులు


తహసీల్దార్ శంకరబాబుకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

పెదనందిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎరువుల కొరతను, అధిక ధరలను నియంత్రించాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శంకరబాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎరువుల కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సొసైటీల్లో స్టాక్ లేకపోవడంతో ప్రైవేటు దుకాణాల్లో ఎరువుల ధరలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచి, కౌ నగ, మొక్కజొన్న విత్తనాలు 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కొత్త వెంకటశివరావు, ముద్దన వెంకటేశ్వర్లు, దొడ్డవరపు రమేష్‌బాబు, నల్లమోతు రాజేంద్ర, కన్నెగంటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : సీఐ

తాడికొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి వారి భవిష్యత్తును బంగారుబాటలు వేసుకోవాలని తాడికొండ సీఐ కే. వాసు పేర్కొన్నారు. బుధవారం తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో వారధి కార్యక్రమాన్ని నిర్వహించి యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్, గంజాయి, మద్యం విచ్చలవిడిగా యువత వినియోగిస్తున్నారన్నారు. చెడు అలవాట్లకు బానిసలైతే వారు బానిసలుగా మారి జీవితాలను నరకానికి చేసుకోవడమే కాకుండా కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ వల్ల ప్రతి ఒక్కరు అప్రమత్తం కావాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ చేసి ఆధార్, పాన్ వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ నెంబర్లు అడిగి డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత బైక్ రేసులు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మహిళలను వేధించినా, వారిపై దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెడు వ్యసనాలు బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు,యువత పాల్గొన్నారు.

క్రైమ్ జోన్

బావిలో పడి వ్యక్తి మృతి

మేడికొండూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి బావిలో పడి బుధవారం మృతి చెందాడు. మేడికొండూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న నేల బావిలో దూకి చెరుకూరి రవికుమార్(45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామం లోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రవికుమార్ మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో పాఠశాల మైదానంలో ఆడుకుంటున్న విద్యార్థులు బావి వద్దకు వెళ్లి చూడగా రవికుమార్ మృతదేహం పైకి తేలుతూ కనిపించింది. విద్యార్థుల ద్వారా విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. దుర్వసనాలు, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తుళ్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని వెంకటపాలెంలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం తుళ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. వెంకటపాలెంలో కొనుగోలు చేసి ఒక చోట నిల్వ చేసి తరలించడానికి సిద్ధంగా ఉండటంతో పోలీసులకు సమాచారం తెలిసింది. దాడి చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన వ్యక్తి ఉయ్యూరు వెంకటేశ్వరరావు చెందినవిగా పోలీసులు గుర్తించి ఆతనిపై కేసు నమోదు చేశారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

● 86 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

తుళ్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని తుళ్లూరు పోలీసులు అరెస్టు బుధవారం చేశారు. వెంకటపాలెంలో వడ్డా వెంకటేశ్వరరావు అనే వ్యక్తి అధనపు ధరలకు ఏపీ మద్యం అమ్ముతున్న సమాచారం రావటంతో పోలీసులు దాడి చేసి 86 క్వార్టర్ బాటిళ్లను (180 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నారు. వెంకటపాలెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావటంతో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. ఏపీ ఎక్సైజ్ యాక్టు కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ-1 గంగా వెంకటేశ్వరావు తెలిపారు.

గుండిమెడలో చైన్‌స్నాచింగ్

తాడేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం గుండిమెడలో ఓ వృద్ధ మహిళ మెడలో నుంచి బైక్‌పై వచ్చి అగంతకుడు 8 సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. రెండు రోజుల క్రితం ఈ ఘటన జరుగగా బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాటిబండ్ల కస్తూరమ్మ అనే మహిళ గుండిమెడలో ఇంటి వద్ద రోడ్డు మీద కు రాగా అదే సమయంలో బైక్‌పై వెళుతున్న ఓ యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. మహిళ కేకలు వేసే టప్పటికి సదరు వ్యక్తి బైక్‌పై ఉడాయించాడు. స్థానికుల ఆ ప్రాంతంలో వెతికినప్పటికీ దొంగ జాడ లభించలేదు. సదరు వృద్ధ మహిళ ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

తహసీల్దార్ కరుణకుమార్

ఫటా ఫట్



ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన భూముల రీ సర్వేలో చాలా తప్పులు ఉన్నాయని, ఆ సమస్యలను రైతుల నుంచి తెలుసుకోవడం ద్వారా వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ కరుణకుమార్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో సమస్యలతో పాటు అన్ని రకాల సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ గ్రామసభలు మండలంలో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో ఫటాఫట్.

రెవెన్యూ గ్రామసభలకు రైతుల నుంచి స్పందన ఉన్నదా?

అన్ని గ్రామాల్లో రైతుల నుంచి మంచి స్పందన లభించింది. గతంలో జరిగిన భూ సర్వేలో చాలా మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. వాటిని పరిష్కరించుకునేందుకు రైతులు అధిక సంఖ్యలో అర్జీలు పెట్టుకున్నారు.

రైతుల నుంచి ఏ విధమైన సమస్యలు ఎక్కువగా వచ్చాయి?

ఆన్‌లైన్‌లో భూముల నమోదు కాకపోవడం, డీఎల్ఆర్‌లో చూపించక పోవడం, ఎల్‌పీఎం బేస్‌లో ఇద్దరి భూములు ఒకరి కిందే చూపించడం, కాలువ కింద భూముల రిజిస్ట్రేషన్ వంటివి ఎక్కువగా నమోదయ్యాయి.

స్థలాలు, ప్లాట్ల విషయంలో కూడా ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయా?

అవును గతంలో జరిగిన సర్వేలో ఈ తప్పులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఉప్పుడు సరిగా చూడకుండా అనధికారికంగా ప్లాట్స్ లే అవుట్స్ అంటూ రికార్డు చేశారు. దీని వల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నా వద్ద రైతును కూర్చోబెట్టుకుని పూర్తి వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులు కూడా పరిశీలిస్తున్నాం. తన పరిధిలో పరిష్కారమయ్యే విషయమైతే పరిష్కరిస్తున్నాను. రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాను.

రూ.22 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాధితులకు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం తాడికొండ ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు 14 మందికి రూ.22 లక్షల 81వేల 788లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ బడేపురం నుంచి చెందిన వనమా రాజేష్‌కు రూ.89,670లు, పాములపాడుకు చెందిన కట్టా గంధ్ర ప్రవల్లికకు రూ.లక్ష, జమ్ములు సాంబశివరావుకు రూ.1,71,710లు మోతడక చెందిన అబ్బూరి నాగేంద్రమ్మకు రూ.74,700లు, పొన్నెకల్లుకు చెందిన ఎర్రగుంట్ల కోటేశ్వరరావుకు రూ.97,980లు, నిడుముక్కలకు చెందిన కలారి వెంకట నరేంద్రకుమార్‌కు రూ.1,08,783లు, గొల్లపాలెంకు చెందిన కార్యంశెట్టి చంద్రమౌళికి రూ.లక్ష, 113 తాళ్ళూరుకు చెందిన పెన్నూరి వెంకట్ రూ.31,192, పెదమానుకు చెందిన మేకల బుల్లెయ్యకి రూ.33,819, బనవోలుకు చెందిన పాలపాటి నాగమల్లేశ్వరరావుకు రూ.1,33,117, తుళ్లూరుకు చెందిన కొలవెన్ను పుల్లమ్మకు రూ.60వేలు, పెదపరిమికి చెందిన గంట వీరయ్య చౌదరికి రూ.12లక్షలు, బనవోలు చెందిన యర్రగొప్ప వసంతకుమార్ రూ.81 వేలు, లింగాయపాలెంకు చెందిన కె ఆనందరావుకు రూ.1,08,600ల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, యడ్లపల్లి సాంబశివరావు, బందారు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

మేడికొండూరు నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో భూమి రీసర్వే పేరుతో ఇష్టారాజ్యంగా రికార్డులు మార్పులు చేయడం వల్ల అనేక మంది భూమి యాజమానులు ఇబ్బందులు పడుతున్నారని, మేడికొండూరు మండలంలో భూమి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మేడికొండూరులో బుధవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వే వల్ల రైతులు ఎదుర్కొంటున్న కారణంగా రెవెన్యూ గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రీసర్వే వల్ల భూములు తప్పులు తడకగా నమోదయ్యాయని కొందరు రైతులు ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. భూయాజమానుల నుంచి వచ్చిన అర్జీలను 15 రోజుల్లోపు పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని తహసీల్దార్ కల్యాణిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కల్యాణి, గ్రామ సర్పంచ్ పాల నాగమణి, జిల్లా డిప్యూటీ సర్వేయర్ మల్లికార్జునరావు, పేరెంగల దాం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షులు మల్లెపెద్ది రమేష్, నాయకులు పాములపాటి శ్రీనివాస్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్

తాడికొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పొన్నెకల్లు సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తరువాత నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగాయని, సగటు మానవుడు జీవించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రధాన మంత్రి దేశ సంపదను పెట్టుబడి దారులైన అదానీ, అంబానీలకు ఊడిగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్, పవన్‌కల్యాణ్, సీఎం చంద్రబాబునాయుడు మోదీ కబంధహస్తాల్లో ఉన్నారని విమర్శించారు. ప్రజలపై విద్యుత్ భారం రూ.18 వేల కోట్లు పడిందన్నారు. ఇసుక సరఫరాలో వైసీపీ, టీడీపీ వైఖరి ఒకే విధంగా ఉందన్నారు. డిసెంబరు 26న సీపీఐ శతజయంతి ఉత్సవాలను అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, నాయకులు రామినేని రామారావు, గుర్రంకొండ సత్యానందం, అనూరాధ, జయమ్మ, దేవుని దయ తదితరులు పాల్గొన్నారు.

రంగ వల్లులతో గ్రామ స్వరూప ప్రదర్శన


అనంతవరప్పాడు గ్రామంలో రంగ వల్లులతో గ్రామ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్న బాపట్ల అగ్రికల్చరల్ విద్యార్థులు

వట్టిచెరుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నివసిస్తున్న రైతులతో మమేకమవుతున్నారు. సాగులో ఉన్న వివిధ రకాల పంటలపై నిత్యం గ్రామ రైతులతో క్షేత్ర స్థాయిలో రైతుల అనుభవాలను అడిగి తెలుసుకుంటున్నారు. బుధవారం పంటల రకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయం వద్ద గ్రామంలోని ప్రధాన రహదారులు, గ్రామంలో వనరులు, పంటలు, నదులు, గ్రామ పంట అంశాలను విద్యార్థులు రంగవల్లులతో తీర్చిదిద్దిన విధానం గ్రామస్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, రైతులు, సచివాలయ సిబ్బంది ఆసక్తిగా తిలకిస్తూ విద్యార్థులను అభినందించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆలపాటినగర్‌లో సాయిమందిర వార్షికోత్సవం

తెనాలి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లోని ఆలపాటినగర్‌లో సద్గురు సాయికుమార్ మందిర్ 21వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి నవరసాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మందిర నిర్వాహకులు పారిశ్రామిక వేత్త కొత్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పి.సదాశివశర్మ పూజాది కార్యక్రమాలు, హారతి, అభిషేకాలు నిర్వహించారు.

సీఎంపై అభ్యంతరక పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు

తెనాలి, మారీసుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4వ తేదీన సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు నాయుడుపై అభ్యంతరకరమైన పోస్టు పెట్టిన కొల్లిపర మండలం వల్లాభాపురం గ్రామానికి చెందిన ఆళ్ల జగదీష్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందుతుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. మరోసారి ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మైనరు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఆర్ఆర్ నగర్ కాలనీకి చెందిన ఓ బాలిక మంగళవారం పాఠశాలకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన ఘటనపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న వాహనాన్ని వెనుక నుంచి వచ్చి ఢీకొట్టి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్ఆర్ నగర్‌కు చెందిన కందుల సాంబశివరావు తన కుమారుడు విష్ణువర్ధనతో కలసి ద్విచక్రవాహనంపై మారీసుపేట వైపు వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ద్విచక్రవాహనదారుడు వారి వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో బండి అదుపుతప్పి కిందపడడంతో తండ్రీ, కొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి పట్టణ జిల్లా వైద్యశాలకు తరలించారు. వారికి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తెనాలి క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులతో గత గురువారం పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన బాలాజీరావుపేటకు చెందిన అప్పన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరురోజులుగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీరావుపేటకు చెందిన అప్పన బిర్యాని పాయింట్‌లో దినసరి కూలీ. భర్త వేధింపులతో పుట్టింటికి వచ్చి, వారికి భారమవగూడదనే ఉద్దేశంతో దీపావళి రోజు కూరగాయల మార్కెట్ రెండో అంతస్తులో ఆత్మహత్యయత్నం చేసింది. చికిత్స నిమిత్తం గుంటూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

హుండీ చోరీపై విచారణ

పొన్నూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో రెండు ఆలయాల్లో హుండీ చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఆ గ్రామంలోని ఆలయాల్లో రెండు హుండీల్లో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఆలయాల్లోకి చొరబడి హుండీలను పగలకొట్టి నగదు చోరీ చేశారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్య గణన సిబ్బందికి శిక్షణ

చేబ్రోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణసర్వే 2024 కార్యక్రమంపై సిబ్బందికి బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో కొప్పాక లలిత ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చి సర్వే నిర్వహించాల్సిన అంశంపై అవగాన కల్పించారు. స్కిల్ సైసెన్స్ అంశంపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను పెంపొందించనునట్లు తెలిపారు. సమావేశంలో ఈవో పీఆర్‌డీ ఉషారాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సునీత

పంట భూముల్లో వ్యర్థాలు తగలబెట్టవద్దు

● డీఆర్‌సీ ఏడీఏ సునీత

తెనాలి రూరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పంటభూముల్లో పైర్లు సాగుపూర్తి అయిన తరువాత వ్యర్థాలను తగలబెట్టవద్దని అలా చేస్తే భూసారం దెబ్బతినడంతోపాటు పోషక లోపాలతో పంటలు సరిగాపండవని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సునీత చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొలకలూరు, హాఫ్‌పేట, ఖాజీపేట గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సునీత జీవన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం మాట్లాడుతూ వరిలో వచ్చే చీడపీడలు వాటిని గుర్తించి తగిన సమయంలో నివారించే విధానంపై రైతులకు సలహాలు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి జి. ప్రేమసాగర్ వరిలో వచ్చే దోమపోటు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వివరించారు. పలువురు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్ నిర్మాణం సాకారమయ్యేనా...?

- ● ఐదేళ్లుగా పొన్నూరు మండల రైతుల ఎదురు చూపులు
- ● చెక్ డ్యామ్ నిర్మాణంతో వేలాది ఎకరాలకు సాగు నీరు
- ● భూగర్భ జలాలు పెరిగే అవకాశం



చెక్ డ్యామ్‌కు ప్రతిపాదించిన ప్రాంతం

పొన్నూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలంలో పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన చెక్ డ్యామ్ నిర్మాణం కోసం ఐదేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారు. పొన్నూరు మండలం సాగునీటి కాల్వలకు చివరి భూములుగా ఉండటంతో ప్రతి ఏటా పంటల సాగు సమయంలో నీటి కోసం రైతులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. పొన్నూరు మండలంలో తూర్పువైపున ఈస్ట్ తుంగభద్ర డ్రెయిన్, పడమర వైపున కొలిమర్ల డ్రెయిన్ ప్రవహిస్తూ ఉంటాయి. ఈ నీరు సముద్రంలోకి వృథాగా పోతూవుంటాయి. 2014-2019 మధ్య రైతులకు తీవ్ర నీటి ఎద్దడి తలెత్తటంతో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సాగునీటి సమస్య పరిష్కారానికి సాగునీటిశాఖ నిపుణులతో చర్చించారు. అయితే వృథాగా పోతున్న డ్రెయిన్ల నీటిని నిల్వ చేసుకుంటే కొంతవరకు ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచించటంతో చెక్ డ్యామ్ నిర్మాణానికి అనువైన ప్రాంతం కోసం అన్వేషించారు. పొన్నూరు - బాపట్ల మండలాల మధ్య ఈస్ట్ తుంగభద్ర డ్రెయిన్, కొలిమర్ల డ్రెయిన్లు కలిసే ప్రాంతాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో చెక్ డ్యామ్ నిర్మిస్తే నీటి నిల్వ చేయవచ్చని ఆలోచనతో ప్రతిపాదనలను సిద్ధం చేయించారు. ఈ నిల్వ ఉన్న నీటిని ఎత్తిపోతల పథకాల ద్వారా కాల్వలకు మళ్లించి పంటసాగు చేయవచ్చని భావించారు. ఇందుకోసం ప్రభుత్వంతో, సాగు, మురుగునీటి శాఖల అధికారులతో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ పలుమార్లు చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.25కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్‌లను నిర్మించి ఎత్తిపోతల పథకాల ద్వారా వృథా నీటితో పంట భూములను సశ్యశ్యామలం చేసే ఈ ప్రతిపాదనపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తొలి ప్రయత్నంగా ములుకుదురు గ్రామం వద్ద రెండు ఎత్తిపోతల పథకాలు, నిడుబ్రోలు వద్ద ఒక ఎత్తిపోతల పథకం నిర్మాణం ప్రారంభించారు. అయితే 2019లో తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోవటంతో ఈ ప్రతిపాదనలు వైసీపీ పాలకులు బుట్టదాఖలు చేశారు. నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాలు సైతం అసంపూర్తిగా నిలిచిపోయాయి.

భూగర్భ జలాలు పెరుగుదల....

పొన్నూరు మండలం నుంచి ప్రవహించే తుంగ భద్ర డ్రెయిన్, కొల్లిమర్ల డ్రెయిన్లపై చెక్ డ్యామ్‌లు నిర్మించటం ద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరు మండల విస్తీర్ణం పెద్దదిగా ఉండటంతోపాటు పలు గ్రామాల్లో భూగర్భ జలాలు ప్రస్తుతం పూర్తిగా అడుగంటిపోయాయి. మరికొన్ని గ్రామాలలో అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను రైతులు పంటల సాగుకోసం యథేచ్ఛగా మోటార్ల ద్వారా తోడివేయటంతో భూగర్భజలాల లభ్యత నానాటికీ తరిగిపోతోంది. మరికొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు ఉప్పు నీటిగా మారిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కావాలంటే చెక్ డ్యామ్‌లు నిర్మించటం ద్వారా కాల్వల్లో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాకుండా కాల్వలో నిల్వ ఉన్న నీటిని పంటల సాగుకు మళ్లించటం ద్వారా మోటార్ల ద్వారా నీటిని తోడిపోసే అవకాశాలు తగ్గి భూగర్భ జలాలు వినియోగం తగ్గుతుందని సాగునీటి నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అధికారంలోకి రావటంతో చెక్ డ్యామ్‌ల నిర్మాణం గురించి ప్రయత్నాలు ప్రారంభించాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించండి

● తెనాలి తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు వీరవల్లి మురళి



ఆటో కార్మికునికి ఆర్థికసాయం అందిస్తున్న వీరవల్లి మురళి, పరిశుద్ధరావు,రాజు తదితరులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెనాలి తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు, టీడీపీ నాయకులు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి అధికారులను కోరారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆటో పాయింట్‌లో బుధవారం తెనాలి తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు వీరవల్లి మురళి ఆటో కార్మికులను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోతో జీవనం సాగిస్తు కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ఆధికారులు సహకారం అందించాలన్నారు. ప్రతిరోజు ఆటో నడుపుకుంటూ వచ్చే ఆదాయం అంతంత మాత్రంగా ఉండగా చలానాల రూపంలో అధికారులకు చెల్లించాల్సి రావడం వారికి కష్టతరంగా ఉందిన్నారు. ట్రాఫిక్ సమస్యలను చూపుతూ ప్రసుత్తం మార్కెట్ వంతెన వద్ద ఉన్న ఆటో పాయింట్‌ను కొత్తవంతెన వద్దకు మార్చాలని అధికారులు చెప్పారని అక్కడకు వృద్ధులు, మహిళలు లగేజీలతో రావాలంటే కష్టమన్నారు. త్వరలోనే ఆటో కార్మికుల సమస్యలను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పరిశుద్ధరావు, సీహెచ్ రాజమోహన్, ప్రవీణ్, రాజు, సుభాని, సతీష్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికునికి ఆర్థికసాయం

ఆటో కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయాన్ని తెనాలి తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు వీరవల్లి మురళి అందించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆటో స్టాండ్‌లో బుధవారం షుగరు వ్యాధితో కాలును కోల్పోయిన ఆటో కార్మికుడు తిరుపతి శ్రీను కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని తెనాలి తెలుగునాడు ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు వీరవల్లి మురళి కార్మికుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



భవన నిర్మాణాల అనుమతులను పరిశీలిస్తున్న జిల్లా రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ మధు కుమార్, టీపీవో సాంబశివరావు తదితరులు

భవన నిర్మాణంలో నిబంధలను పాటించండి

● రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ మధు కుమార్

తెనాలి, మారీసుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు భవన నిర్మాణంలో పురపాలక సంఘ నియమ నిబంధలను పాటించాలని జిల్లా రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానర్ మధుకుమార్ అన్నారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం టౌన్ ప్లానింగ్ విభాగంలో వార్షిక తనిఖీలను జిల్లా రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానర్ మధుకుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగం వారి నియమ నిబంధనల ప్రకారం నూతన నిర్మాణాలను చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాలలో జరుగుతున్న భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, ఆర్‌డీడీటీసీపీ స్టాఫ్, పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జపాన్‌లో విద్యపై ఏఎన్‌యూ విద్యార్థుల అధ్యయనం

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ ఆహ్వానం మేరకు వారం రోజులు సకురా సైన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులు జపాన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం బుధవారం అభినందించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగపు విద్యార్థులు ఎస్.కె.సమీర్, త్రిపురనేని వసంత బాబులు గత నెల 22 నుంచి 26 వరకు టయోమో రాష్ట్రంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలను సందర్శించి అక్కడ ఎడ్యుకేషన్, రీసెర్చ్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని అన్ని వర్తక వాణిజ్య సంస్థలు ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బిశేషన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంఎస్ఎంఈల పనితీరును మెరుగు పర్చడానికి అభివృద్ధిని వేగవంతం చేయడానికి ప్రపంచ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ (ఆర్ఏఎంపీ)అనే పథకాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఈ పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రవేశపెట్టారన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని ఎంఎస్ఎంఈలను సర్వేచేసి వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకువచ్చి ఏపీఎంఎస్ఎంఈ వన్ అనే పోర్టల్‌కు అనుసంధానించడం, నమోదు కాని వ్యాపారాలను ఉద్యమ్, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేయడం ద్వారా తద్వారా విధానపరమైన మౌలిక వసతులకు సంబంధించిన కార్యక్రమాలను ప్రభుత్వ చేపట్టడం కోసం ఈ సర్వేను ప్రారంభించారని తెలిపారు. ఈ సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌గా తెనాలి నుండి నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు.



టీడీపీ సభ్యత్వాలను చూపుతున్న నాయకులు

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు బీమా: బండ్లమూడి

పొన్నూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోవటం ద్వారా కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా రక్షణ కల్పిస్తునట్లు మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు తెలిపారు. మండల పరిధిలోని బ్రహ్మణకోడూరు, గోళ్లమూడిపాడు గ్రామాల్లో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల స్థాయి నాయకులు ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, చల్లంశెట్టి సీతారామయ్య, సోపాటి వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

లోకకల్యాణం కోసం లక్ష్మీగణపతి హోమం

తెనాలి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో లోక కళ్యాణం కాంక్షిస్తూ లక్ష్మీగణపతి హోమం చేశారు. నాజరుపేటలోని విద్యాశంకర భారతి నృశింహసదన్‌లో బుధవారం ఈ హోమం నిర్వహించారు. సమాఖ్య కార్యదర్శి సూర్యనారాయణమూర్తి, కోశాధికారి తిరుమలరావు పర్యవేక్షణలో ఆగమశాస్త్ర పండితులు రాంపల్లి ప్రసాదశర్మ శిష్యబృందంతో కలిసి హోమ క్రతువు నిర్వహించారు. అనంతరం శివునికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం జరిపారు. బి.కామేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, అనీల్‌కుమార్, శ్రీనివాసమూర్తి, అంజనేయులు, రామకృష్ణ, ప్రభాకరశర్మ పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

తెనాలి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గత రెండు విద్యా సంవత్సరాల్లో ఐటీఐ పూర్తిచేసిన 243మంది విద్యార్థులకు కుమార్ పంప్స్ ఎండీ ఎ.సుబ్రహ్మణ్యం, మారుతీ సుజుకి హెచ్ఆర్ మేనేజర్ జి.పురుషోత్తం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐటీఐ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. శ్రద్ధతో సిలబస్‌ను అవగాహన చేసుకుని చేయాల్సిన పనిలో నైపుణ్యం సాధించాలని చెప్పారు. ప్రిన్సిపాల్ చినవెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో టాపర్‌గా నిలిచిన అవినాష్‌కు బహుమతి అందజేశారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి: ఏడీఏ

పొన్నూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు విధిగా పంటల బీమా చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వీ రామకోటేశ్వరి అన్నారు. మండల పరిధిలోని జడవల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వరి పైరును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం వరి పైరు ఈనిక దశలో, పూత దశలో ఉందన్నారు. ఈ సమయంలో అగ్గి తెగులు నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పూత రాలిపోయి నష్టాలు రాకుండా ఉండాలంటే మధ్యాహ్నం 2గంటల తర్వాత మందులు పిచికారి చేయాలని సూచించారు. అలాగే దాళ్వా సమయంలో మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పండించే రైతులు పంట బీమా పథకంలో చేరాలని సూచించారు. రైతులు నామమాత్రంగా ఉన్న ప్రీమియం నగదును చెల్లించాలన్నారు. రైతులు మీ సేవా కేంద్రాలలో కానీ, సీఎస్‌సీ సెంటర్‌లో కానీ పంటల బీమా నమోదు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 31వ తేదీలోగా ఈ పథకంలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో డేగల వెంకటరామయ్య, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్ మోహన్

ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలి: డీటీ రాజా రమేష్

పొన్నూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక, సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రాజరమేష్ మోహన్ ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశం జరిగింది. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీలోగా సాగునీటి సంఘాల ఎన్నికల సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. 1బీ, అడంగల్ వివరాలను పరిశీలించి జాబితాలో ఉన్న రైతులను ఓటర్లుగా గుర్తించాలని సూచించారు. అలాగే పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి వచ్చిన ఓటు హక్కు దరఖాస్తును ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'అన్వేషణ 2024'

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యార్థులలో నూతన ఆవిష్కరణలను, ఆలోచనలను ప్రోత్సహించేందుకు గాను అఘస్త్యా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన 'అన్వేషణ 2024' కార్యక్రమాన్ని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని ఐఐస్, ఐయూసీఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సృజనాత్మక ఆవిష్కరణలు, విమర్శనాత్మక ఆలోచనలు ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్వేషణ సంధానకర్త మల్లేష్ బట్టు తెలిపారు. అందులో భాగంగా 25 బృందాల విద్యార్థులు వారి ఆవిష్కరణల ఆలోచనలను, నమూనాలను ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు హాజరైన ప్రొఫెసర్ కె.ఎస్.వి.ఆర్ కుమార్, అన్వేషణ సంధానకర్త మల్లేష్ బట్టు విద్యార్థులు రూపొందించి ఆవిష్కరణల నమూనాలకు తగు సూచనలు అందించారు. ప్లాస్టికును అరికట్టడం, ఆటోమేటిక్ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ సిస్టమ్, సోలార్ కార్ అవిష్కరణల నమూనాలు అన్వేషణ గ్రాండ్ ఫినాలేకు ఎంపికయినట్లు మల్లేష్ బట్టు తెలిపారు.

రైలు నుంచి జారిపడే ప్రమాదాల నివారణకు చర్యలు

● జీఆర్‌పీ ఎస్ఐ వెంకటాద్రి



తెనాలి క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రైలు నుంచి జారిపడి మృత్యువాత పడే వారి సంఖ్య పెరుగుతోందని, దీని నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెనాలి జీఆర్‌పీ ఎస్ఐ జి.వెంకటాద్రి ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఫటా ఫట్

ప్రశ్న: ఇటీవల కాలంలో రైలు నుంచి జారి పడి మరణించే వారి సంఖ్య పెరుగుతోంది కారణాలు ఏమిటి?

జవాబు: తెనాలి రైల్వే స్టేషన్ నుంచి రోజు 125 రైళ్ల రాకపోకలు సాగుతాయి. ఇతర రాష్ట్రాలలో ఉపాధి కోసం వెళ్లేవారు, రాత్రి వేళల్లో యూరినల్స్‌కు వెళ్లినప్పుడు, సెల్‌ఫోన్‌ను మాట్లాడుతూ గేటు వద్ద కూర్చోవడం, నిద్రమత్తులో గాలి కోసం డోర్ వద్ద ఉన్నప్పుడు కుదుపులు వచ్చి జారిపడి మరణిస్తున్నారు.

ప్ర: రైలు నుంచి జారిపడి మృతిచెందిన కేసులు ఎన్ని?

జ: ఈ మధ్య కాలంలో 20 మరణాల వరకు గుర్తించడం జరిగింది. అందులో 15 మృతులను గుర్తించి వారి కుటుంబాలకు సమాచారం తెలిపాం. జారి పడి మృతి చెందే వారిలో ఇతర రాష్ట్రాల వారే ఎక్కువగా ఉంటున్నారు. వారి వద్ద సరైన గుర్తింపు కార్డులు, ఆధారాలు ఉండక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ప్ర: రైళ్లలో దొంగతనాలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ప్రతి రైలులో జీఆర్‌పీ సిబ్బంది ఉంటారు. ప్లాట్‌ఫారంపై నిఘా ఉంటుంది.

ప్ర: తెనాలి రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో రైళ్లలో దొంగతనాలకు పాల్పడే వారిని ఎంతమందిని గుర్తించారు?

జ: ఈ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 103మంది రైల్వే దొంగలను గుర్తించడం జరిగింది. వీరి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది.

ప్ర: దొంగతనాల నివారణకు సూచనలేంటి?

జ: రైలు మలుపు తిరిగే సమయంలో, బ్రిడ్జిల సమీపంలోను, బండి ప్లాట్ ఫారంపైకి రావడానికి అవుటర్‌లో కొంత స్లో చేసుకునే సమయంలో దొంగతనం చేసి దొంగలు బండి దిగి తప్పించుకుంటారు. అయా సమయాల్లో ప్రయాణికులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రయాణ సమయంలో పిల్లలు, వస్తువులు జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించారు.

ప్ర: స్టేషన్‌లో ప్రయాణికులు సూట్‌కేసు లాంటి వస్తువులు మరిచిపోయినప్పుడు ఎవరిని సంప్రదించాలి?

జ: అన్ని ప్రధాన స్టేషన్‌లలో సీసీ కెమెరాలు, సిబ్బంది నిఘా ఉంటుంది. వస్తువులు పోయిన వారు వెంటనే రైల్వే స్టేషన్ సిబ్బందిని సంప్రదించాలి.



రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

● పురపాలక సంఘ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తున్నామని అందుకు ప్రజలు కూడా సహకరించాలని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. శివాజీచౌక్‌లో బుధవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నతో కలసి రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో పట్టణ అభివృద్ధి పనులను ప్రారంభిచామని తెలిపారు. అందులో భాగంగా రోడ్డు విస్తరణ 130 మీటర్లకు రూ.20.5 లక్షలతో పనులను ప్రారంభించామన్నారు. రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు నియంత్రించవచ్చని, వర్షపునీరు రోడ్లపై నిలువకుండా డ్రెయిన్‌లోకి వెళ్లే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎవరు రోడ్లను ఆక్రమించవద్దని సూచించారు. ముందుగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ ఎ.శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, అసిస్టెంటు సిటీ ప్లానర్ శ్రీమన్నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రహదారి పక్కన ఉన్న వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

వ్యర్థాలను రహదారులపై వదిలివేస్తే చర్యలు

పొన్నూరు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారుల వెంట, నివాస సముదాయాల ప్రాంతాల్లో వ్యర్థాలను వదిలివేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని 18, 19 వార్డుల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు వెంట వ్యర్థాలు గుట్టలుగా పోసి ఉండటానికి గుర్తించి తక్షణమే తరలించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. మురుగు కాల్వలో పూడికతీత పనులను పరిశీలించారు. ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా రోడ్డు మార్జిన్ల ఎత్తు తగ్గించాలని ఆదేశించారు. 19వ వార్డులోని పార్క్‌ను పరిశీలించి పిచ్చిచెట్లను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పార్క్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయ వైదిక కమిటీ ఏర్పాటు

● ఆలయ ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు

పెదకాకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం వైదిక కమిటీ, ఆగమ కమిటీ ఏర్పాటు జరిగిందని ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సమక్షంలో దేవస్థాన అర్చకస్వాములు, వేద పండితుల సమక్షంలో సమావేశంలో తీర్మానం చేసి మిగతా అర్చకస్వాములు అందరి అమోదంతో వైదిక కమిటీ, ఆగమ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆలయ స్థానాచార్యులు అధ్యక్షుడిగా వైదిక కమిటీకి కొత్తూరు సాంబశివరావు, కమిటీ సభ్యులుగా పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, ప్రధాన అర్చక, చదలవాడ జాలయ్య, ఉప ప్రధాన అర్చక, పేటేటి ధనమహేశ్వర ప్రసాదు, ఉప ప్రధాన అర్చక, చదలవాడ శివశంకరశాస్త్రి, ముఖ్య అర్చక, వ్యాకరణం గణపతిశర్మ, ఋగ్వేదం వేదపండితులు ఉన్నారని ఆలయ ఉప కమిషనరు తెలిపారు. ఆలయంలో పూజ విధానాలకు ముఖ్యమైన మతపరమైన విషయాలపై నిర్ణయాలు తీసుకోవడంలో, ఆలయ ఆచారాలు,సేవలను నిర్వర్తించే విధానం, స్థిరీకరణ యాగాలు, కుంబాభిషేకాలు, ఇతర వైదిక కార్యక్రమాల నిర్వహణకు ముహూర్తాలు, పండుగలు, నూతన సేవలు ప్రవేశపెట్టడానికి ప్రతిపాదించడం కోసం వైదిక కమిటీ నిర్ణయం తీసుకుంటుందని ఆలయ ఉపకమిషనరు తెలిపారు.